ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
బుధవారం 18 డిసెంబరు 2024



పేక.. ముక్క.. వేటు..!

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఎస్ఐ రాంప్రసాద్

యల్లనూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): 'పేక.. ముక్క' నిర్వహణకు సహకరించిన పోలీసులపై అధికారులు చర్యలు తీసుకున్నట్లు సమాచారం. ఎస్ఐ రాంప్రసాద్‌తో పాటు ఓ కానిస్టేబుల్‌ను ఉన్నతాధికారులు వీఆర్‌కు పంపారు. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు వచ్చాయి. ఈనెల 15న చిలమకూరు ఆంజనేయస్వామి తిరుణాలలో బహిరంగంగా పేక.. ముక్క ఆడించారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో డీఎస్పీ వెంకటేశ్వర్లు, పుట్లూరు సీఐ సత్యబాబు విచారించారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. దీని ఆధారంగా ఎస్ఐ రాంప్రసాద్, కానిస్టేబుల్ విజయ్‌నాయక్‌ను వీఆర్‌కు పంపారు.

భూమి రికార్డులను మార్చారు

రెవెన్యూ అధికారులకు బాధిత రైతు ఫిర్యాదు

ఆత్మకూరు డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): 'కూలీనాలి చేసి సంపాదించిన రూ.20 లక్షలతో భూమి కొన్నాను. మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ప్రమేయంతో రికార్డులను మార్చేశారు..' అని ఆత్మకూరుకు చెందిన రైతు షాజహాన్ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆత్మకూరులో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సర్వే నంబరు 122లో ఐదు ఎకరాల భూమిని ఎనిమిదేళ్ల క్రితం ఆత్మకూరుకు చెందిన జగన్ మోహన్ రెడ్డి నుంచి కొన్నానని, చుక్కలు పడటంతో పట్టాదారు పుస్తకం కోసం రెవెన్యూ అధికారులను సంప్రదించామని తెలిపారు. రూ.10 లక్షలు ఇస్తే భూమి ఇస్తామని జగన్ మోహన్ రెడ్డి బేరం పెట్టారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఆ తరువాత జగన్ మోహన్ రెడ్డి ఆయన భార్య పేరిట రికార్డులను మార్పించాడని వాపోయాడు. తనకు భూమి అమ్మకముందు కెనరా బ్యాంకులో రెండు లక్షలు అప్పు చేశాడని, అమ్మిన తరువాత సొసైటీలో మరో రెండు లక్షలు తీసుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశాడు. మాజీ ఎమ్మెల్యే తండ్రి ఆత్మారామిరెడ్డి ప్రమేయంతో సొసైటీలో అడంగల్ మీద అప్పు ఇచ్చారని ఫిర్యాదు చేశారు. తమ భూమి తమకు దక్కకపోతే కుటుంబం మొత్తం ఆత్మహత్య చేసుకుంటామని తహసీల్దారు లక్ష్మీనాయక్ వద్ద ఆవేదన వ్యక్తం చేశాడు. న్యాయం జరిగేలా చూస్తామని టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, పార్లమెంటు నియోజకవర్గ అధికార ప్రతినిధి శశాంకచౌదరి హామీ ఇచ్చారు. అధికారులు పరిశీలించి న్యాయం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి వెంకటనారాయణ, మండల నాయకులు మాధవరెడ్డి, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.



చెట్టు మీదే.. కుళ్లిన మిరప

బ్యాడిగను దెబ్బతీసిన తుఫాను



తుఫాన్ వర్షాలకు దెబ్బతిన్న బ్యాడిగ మిరప

- ధరలు లేక.. పలకరించని వ్యాపారులు
- రూ.40 కోట్లకు పైగా పెట్టుబడి నష్టం
- దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు



దెబ్బతిన్న కాయలను వేరు చేస్తున్న కూలీలు

కూడేరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): బ్యాడిగ మిరప సాగు చేసిన రైతులు నష్టాలను మూట కట్టుకుంటున్నారు. కూడేరు మండలంలో సుమారు రెండు వేల ఎకరాలలో బ్యాడిగ మిరప సాగైంది. ఒక్క ముద్దలాపురంలోనే 15 వందల ఎకరాల విస్తీర్ణంలో పంట పెట్టారు. మొక్క నాటినప్పటి నుంచి కంటికి రెప్పలా కాపాడుకున్నారు. తెగుళ్ల నివారణకు రకరకాల మందులను పిచికారీ చేశారు. తుఫాను ప్రభావంతో నవంబరులో కురిసిన వర్షాలకు పంట దెబ్బతింది. మొక్క దశలో నల్లి పురుగు సోకడంతో దిగుబడి తగ్గింది. కాయ దశలో వర్షాలు కురవడంతో దిగుబడి పాడైపోయింది. ఎక్కడ చూసినా కుళ్లిపోయిన కాయలే కనిపిస్తున్నాయి. దీనికితోడు రంగు సరిగా రావడం లేదు. ఎకరానికి పది నుంచి పదిహేను క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. ప్రస్తుతం ఎడెనిమిది క్వింటాళ్లు కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ముద్దలాపురంలో ఒక్కొక్క రైతు రెండు ఎకరాల నుంచి ఇరవై ఎకరాల విస్తీర్ణంలో పంట సాగు చేశారు. ఎకరానికి రూ.రెండు లక్షలకు పైగా పెట్టుబడి పెట్టారు. క్వింటానికి రూ.2 వేల నుంచి రూ.6 వేలు మాత్రమే ధర వస్తోంది. రైతులు పెట్టుబడి రూపంలోనే రూ.40 కోట్లదాకా నష్టపోయారు. కూలీల ఖర్చులు కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎగుమతి లేక...

బ్యాడిగ మిరప ఎగుమతులు నిలిచిపోవడం రైతులకు శాపంగా మారింది. గతంలో చైనా, థాయిలాండ్, ఇండోనేషియా, అరబ్ దేశాలకు బ్యాడిగ మిరపకాయలను ఎగుమతి చేసేవారు. ప్రస్తుతం ఎగుమతులు లేకపోవడంతో ధర పతనమైందని హార్టికల్చర్ అధికారులు అంటున్నారు. రెండేళ్ల క్రితం క్వింటానికి రూ.60 వేల వరకూ ధర లభించింది. నేడు ఆరు వేల కూడా లభించడం లేదు. ఎగుమతులు ఉన్నప్పుడు వ్యాపారులే గ్రామాలకు వచ్చి పోటీపడి కొనేవారు. ఇప్పుడు పలకరించేవారే లేరని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్ల క్రితం వరకూ తమ ఊరు వ్యాపారులతో కళకళలాడిందని, ఇప్పుడు బోసిపోయిందని ముద్దలాపురం రైతులు అంటున్నారు. పెట్టుబడి పెరిగిందని, ధర పతనం కావడంతో అప్పులపాలయ్యామని అంటున్నారు. సంక్షోభం నుంచి ఎలా గట్టెక్కాలో తెలియడం లేదని ఆవేదన చెందుతున్నారు.

ఊహించలేదు



బ్యాడిగ మిరప సాగు చేస్తే ఇంత నష్టం వస్తుందని ఊహించలేదు. దిగుబడి ఆశించిన స్థాయిలో రాలేదు. ధర పూర్తిగా పడిపోయింది. నాలుగు ఎకరాల్లో రూ.8 లక్షలు పెట్టుబడి పెట్టి పంటను సాగు చేశాను. మొత్తం దెబ్బతినింది. కాస్తో, కూస్తో ఉన్న కాయలను కొనుగోలు చేయడానికి వ్యాపారులు ముందుకు రావడం లేదు.

- రామాంజనేయులు, ముద్దలాపురం

నిద్ర పట్టడంలేదు..



రెండున్నర ఎకరాల్లో బ్యాడిగ మిరప సాగుకు నాలున్నర లక్షలు పెట్టుబడి ఖర్చు అయింది. పంట దెబ్బతిని అప్పు మిగిలిపోయింది. అప్పులిచ్చిన ఆసాములకు ఏం సమాధానం చెప్పాలో అర్థం కావడం లేదు. రాత్రి పూట నిద్రపట్టడం లేదు.

- సుధాకర్, ముద్దలాపురం

మూడేళ్లుగా నష్టాలు..

బ్యాడిగ మిరప సాగు చేసి మూడేళ్లుగా నష్టపోతున్నాను. నాకున్న 4.50 ఎకరాల్లో బ్యాడిగ మిరప సాగు చేస్తే.. రూ.10 లక్షల వరకు అప్పు మిగిలింది. ఈ ఏడాది కూడా కలిసిరాలేదు. వర్షాలకు పంట పూర్తిగా దెబ్బతింది.



- ఈడిగ వెంకటరాముడు, ముద్దలాపురం

ప్రభుత్వమే ఆదుకోవాలి..



నాలుగు ఎకరాల్లో బ్యాడిగ మిరప సాగు చేసినందుకు రూ.7 లక్షల వరకు నష్టం వచ్చింది. గతంలో ఎన్నడూలేని విధంగా తుఫాను దెబ్బతీసింది. అధికారులు నష్టాలను అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలి. బ్యాడిగ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- రామచంద్ర, ముద్దలాపురం

ఎనిమిది ఎకరాల్లో...



ఎనిమిని ఎకరాల్లో బ్యాడిగ మిరప సాగు చేశాను. రూ.15 లక్షల వరకు పెట్టుబడి పెట్టాను. పంటను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చాను. నవంబరులో వర్షాలు రావడంతో కాయలు కుళ్లిపోయాయి. వాటిని తొలగించేందుకు చేతిలో చిల్లి గవ్వ లేక ఇబ్బందులు పడుతున్నాం.

- వెంకటేశులు, ముద్దలాపురం

కౌలుకు తీసుకుని నష్టపోయా..



నాకు 3 ఎకరాల పొలం ఉంది. మరో 13 ఎకరాలు కౌలుకు తీసుకుని బ్యాడిగ మిరప సాగు చేశాను. పంట దెబ్బతినడంతో రూ.25 లక్షల వరకు నష్టం వచ్చింది. మూడేళ్ల నుంచి నష్టాలు వస్తున్నాయి. ఈ ఏడాది అప్పుల నుంచి బయట పడతామని ఆశ ఉండేది. వానలు నా ఆశలపై నీళ్లు చల్లాయి.

- ఇటిగౌని నారాయణస్వామి, ముద్దలాపురం

పొలంలోనే కాయలు



అప్పు చేసి లక్షలు పెట్టుబడి పెట్టాను. ఆరు ఎకరాల్లో బ్యాడిగ మిరప సాగు చేశాను. పొలంలోనే కాయలు దెబ్బతిన్నాయి. పంటను కాపాడుకోవడానికి ఆరుగాలం కష్టపడితే వర్షం దెబ్బకొట్టింది. అప్పులు మిగిలాయి. ఏం చేయాలో అర్థం కావడంలేదు.

- కదిరిప్ప, ముద్దలాపురం


నేరం నాయకులదేనా..?

ఐదేళ్లపాటు అధికారులు చూడలేదా..?



టవర్ కూలకుండా ప్రజల సొమ్ముతో చుట్టూ మట్టి

- అక్రమ లే అవుట్లు.. గ్రావెల్ తవ్వకాలు కనిపించలేదా..?
- టీడీపీ నాయకుల ఫిర్యాదు.. కలెక్టర్ ఆదేశాలతోనే కదలిక
- వైసీపీ హయాంలో చాలా శాఖలకు అవినీతి మరక
- అధికారులు.. సిబ్బందిపై చర్యలు ఉండవా..?



విద్యుత్‌టవర్ చుట్టూ గ్రావెల్‌ను దోచేసిన వైసీపీ నాయకులు (ఫైల్)

యాడికి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా అక్రమ లే అవుట్లు వేశారు. వాటిలోకి వేల టిప్పర్ల గ్రావెల్‌ను అక్రమంగా తరలించారు. ఈ క్రమంలో ప్రభుత్వ, మాన్యం భూములను అడ్డదిడ్డంగా తవ్వేశారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకులు అడ్డదిడ్డంగా దోచుకున్నారు. ఇదేమీ గుట్టుగా సాగిన వ్యవహారం కాదు. వేలాది మంది జనం చూస్తుండగా, రేయింబవళ్లు నిరంతరాయంగా ప్రకృతి వనరులపై జరిగిన దాడి. ఇదంతా అప్పట్లో అధికారులకు కనిపించలేదా..? పోనీ.. కనిపించలేదనే అనుకుందాం..! నాటి ప్రతిపక్ష నాయకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా ఎందుకు స్పందించలేదు..? బాధ్యత లేకుండా ఎందుకు వ్యవహరించారు..? ఇదీ.. ఇప్పుడు మండల వ్యాప్తంగా జరుగుతున్న చర్చ. అక్రమాలలో అధికారుల నిర్లక్ష్యం ఎంత..? అవినీతి ఎంత..? దీన్ని నిగ్గు తేల్చాలి కదా..? అని ప్రశ్నిస్తున్నారు. అధికారుల సహకారం లేకుండా గ్రావెల్ దందా, అక్రమ లే అవుట్ల సాధ్యం కాదని అంటున్నారు. ఉన్నతాధికారులు ఆ దిశగా చర్యలు తీసుకుంటారా..? లేక దీనిపైనా ఎవరో ఒకరు ఫిర్యాదు చేస్తే చూద్దాం అనుకుంటారా..?

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ అక్రమాలపై చర్యలు మొదలయ్యాయి. అదే తరహాలో యాడికి మండలంలో అక్రమార్కులపైనా చర్యలు మొదలయ్యాయి. గ్రావెల్ దందా గురించి టీడీపీ నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో విచారణ మొదలైంది. రెవెన్యూ, ట్రాన్స్‌కో, మైన్స్ తదితర శాఖల అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి.. తవ్వినవారిని, తవ్వకాలపై ఫిర్యాదు చేసినవారిని విచారించారు. ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు. మొదటి చర్యగా.. ట్రాన్స్‌కో అధికారుల ఫిర్యాదు మేరకు వైసీపీ నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇక మిగిలిన శాఖల వ్యవహారం ఏమిటో త్వరలో తేలనుంది.

పోతేపోనీ అనుకున్నారా..?

గ్రావెల్ అక్రమ తవ్వకాల కారణంగా పెద్దపేట సమీపంలోని 220 కేవీ విద్యుత్ టవర్లు కూలిపోయే పరిస్థితి ఎదురైంది. ఓ టవర్ చుట్టూ ఏకంగా 14 అడుగుల లోతు తవ్వారు. కళ్లెదుటే కనిపిస్తున్నా ఆ శాఖ అధికారులు ఇన్నాళ్లూ పట్టించుకోలేదు. ఎవరో ఫిర్యాదు చేయాలి.. ఇంకెవరో విచారించి.. అక్రమం నిజమే అని నిర్ధారించాలి..! అప్పుడుగానీ విద్యుత్ శాఖ చర్యలకు దిగదు..! వైసీపీ నాయకులు తవ్వగా ఏర్పడిన గుంతలలోకి మట్టిని తోలి పూడుస్తున్నారు. ఇది ప్రజలకు ఇంకో నష్టం..! వందల ట్రాక్టర్ల గ్రావెల్‌ను తరలించినా.. మునుపటి పటిష్టత రాదు. అనుకోని ప్రమాదం జరిగి ఉంటే.. పరిస్థితి ఏమిటి..? టవర్లను తిరిగి ఏర్పాటు చేసేందుకు ఎంత ఖర్చు అయ్యేది..? విద్యుత్ సరఫరా రోజుల తరబడి నిలబడితే.. వాటి పరిధిలోని పరిశ్రమలు, ఇతర వినియోగదారులకు జరిగే నష్టాన్ని పూడ్చేది ఎవరు..? ఒక్కో టవర్ ఏర్పాటుకు రూ.2 కోట్ల దాకా ఖర్చవుతుందని, కనీసం నాలుగు టవర్లు కూలేవని అధికారులు అంటున్నారు. ఈ లెక్కన టవర్ల పునరుద్ధరణకు రూ.8 కోట్ల దాకా అవుతుంది. దీనికంతటికీ కారణం అధికారల నిర్లక్ష్యం, అవినీతి వ్యవహారాలు కాదా..? అని జనం ప్రశ్నిస్తున్నారు.

దేవుడికే వదిలేశారా..?

మాన్యం భూముల సహా.. ఆలయాలకు సంబంధించిన అన్ని ఆస్తుల పరిరక్షణ, నిర్వహణ కోసం ప్రత్యేకంగా దేవదాయశాఖ ఉంది. అన్నీ దేవుడే చూసుకుంటాడులే అన్నట్లుగా వ్యవహరించారు ఆ శాఖ అధికారులు. వైసీపీ నాయకులు అడ్డదిడ్డంగా తవ్విన 220 కేవీ విద్యుత్‌టవర్ ఉన్న ప్రాంతం ఆలయ మాన్యం భూమి. అక్కడ భారీగా తవ్వకాలు జరిగినా ఆ శాఖ అధికారులు నిద్రమత్తు ఎందుకు నటించినట్లు..?

కనబడలేదా..?

లే అవుట్లు వేసి.. ప్లాట్లు విక్రయించడం అంటే గుట్టుగా సాగే పనికాదు. మార్కెటింగ్ వ్యవహారం..! ఊరూవాడా తెలిసిపోతుంది. మరీ ముఖ్యంగా పంచాయతీ, రెవెన్యూ శాఖల ప్రమేయం లేకుండా లే అవుట్లు వేయడం జరగదు. కానీ యాడికి మండలంలో చాలా లే అవుట్లు అనుమతి లేకుండానే వేశారు. గ్రావెల్ దందాపై విచారణ సమయంలో వీటి ప్రస్తావనా వచ్చింది. అక్రమ లే అవుట్లపై ఫిర్యాదుల వెళితే.. తూతూ మంత్రంగా నోటీసులు ఇచ్చి వదిలేశారు. వైసీపీ హయాంలో చాలామంది అధికారులు ముడుపులు తీసుకుని మౌనం వహించారు.


బాధ్యతగా వ్యవహరిస్తే..



అధికారులు బాధ్యతగా విధులను నిర్వర్తిస్తే ఏ సమస్యలూ ఉండవు. కొందరు అధికారుల స్వార్థం, అవినీతి కారణంగా ఇలా జరుగుతోంది. మరికొందరు రెండు పార్టీ నాయకుల మధ్య చిచ్చుపెట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారు. దీనివల్ల గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగే ప్రమాదం ఉంది. ఏదైనా సమస్య అధికారుల దృష్టికి వెళ్లినప్పుడు తక్షణమే స్పందిస్తే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఉండవు.

- గంగాధర్, యాడికి

వెంటనే స్పందించాలి కదా..?



సమస్య ఏదైనా.. అధికారులు వెంటనే స్పందించాలి. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ అధికారుల బాధ్యత. ప్రజలు ఫిర్యాదు చేసినా, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా వెంటనే స్పందించడం లేదు. అందుకే అక్రమార్కులు రెచ్చిపోతుంటారు. అధికారులు వెంటనే స్పందిస్తే నష్టాన్ని అరికట్టవచ్చు. విద్యుత్ టవర్ వద్ద గ్రావెల్ తవ్వకం విషయంలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనబడుతోంది. అంత పెద్దఎత్తున గ్రావెల్ తరలింపు ఒకటి రెండురోజుల్లో జరిగే పనికాదు. సమస్య అధికారుల దృష్టికి వెళ్లినా చూసీచూడనట్లు వ్యవహరించారు. అందుకే విద్యుత్ టవర్ కూలిపోయే దశకు చేరుకుంది. ఈ నష్టాన్ని ప్రజలే భరించాల్సి వస్తున్నది. టీడీపీ నాయకుల ఫిర్యాదుతోనే వైసీపీ నాయకులపైన చర్యలు చేపడుతుండడంతో పార్టీల మధ్య చిచ్చుపెట్టేలా అధికారుల తీరుఉంది.

- పరిమి చరణ్, రాయలచెరువు

ఫ్యాక్టర్-9 ఇంజెక్షన్ల కొరత

హిమోఫీలియా బాధితులకు నరకం

గుంతకల్లు టౌన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఫ్యాక్టర్-9 ఇంజెక్షన్ల కొరత ఏర్పడింది. దీంతో హిమోఫీలియో బాధితులు నరకయాతన పడుతున్నారు. నెల రోజుల నుంచి ప్రభుత్వ ఆసుపత్రిలో ఫ్యాక్టర్-9 ఇంజెక్షన్లు లేవు. దీంతో వీటిని బయట రూ.10 వేలదాకా వెచ్చించి కొంటున్నారు. గుంతకల్లు, గుత్తి, ఉరవకొండ, యాడికి మండలాల పరిధిలో 20 మంది హిమోఫీలియో బాధితులు ఉన్నారు. గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో సెప్టెంబరు 2023 నుంచి ఫ్యాక్టర్-8, ఫ్యాక్టర్-9 ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచుతున్నారు. జన్యు లేదా ఎంజైముల లోపంతో చిన్నతనంలోనే హిమోఫీలియా సంక్రమిస్తుంది. వీరికి చిన్న గాయమైనా రక్తస్రావం ఆగదు. రక్తం గడ్డకట్టే పరిస్థితి అసలు ఉండదు. ఈ కారణంగా జాయింట్ ఎముకల వద్ద వాపు వస్తుంది. భయంకరమైన నొప్పి ఉంటుంది. వీరికి ఫ్యాక్టర్-9 ఇంజెక్షన్లు తప్పనిసరిగావేయాలి. వ్యాధి తీవ్రతను బట్టి, డాక్టరు సలహాతో రోజూ ఇంజెక్షన్లు వాడాల్సి ఉంటుంది. నెల రోజులగా ఇంజెక్షన్లు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు, వైద్యాధికారులు స్పందించి.. ఫ్యాక్టర్-8, 9 ఇంజెక్షన్లను అందుబాటులో ఉండేలా చూడాలని బాధితులు కోరుతున్నారు.



ఓటర్ల అర్జీలపై ఆరాతీస్తున్న కలెక్టరు వినోద్‌కుమార్

ఇళ్ల వద్దకు కలెక్టర్

ఓటర్ల అర్జీలపై ఆరా

అనంతపురం టౌన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాలో తప్పులు, చిరునామాల మార్పు, కొత్తగా జాబితాలో చేర్పడం వంటి అర్జీలు ఇచ్చుకున్నవారి ఇళ్లకు కలెక్టరు వినోద్‌కుమార్ మంగళవారం నేరుగా వెళ్లారు. జనవరి నెలలో తుది ఓటరు జాబితాను విడుదల చేయనున్నారు. దీంతో ఇప్పటివరకు ఓటర్ల నుంచి వివిధ రకాల మార్పుల కోసం 6, 7, 8 దరఖాస్తు ఫారాలు తీసుకున్నారు. వాటిని పరిశీలించి తగిన విధంగా సవరించాల్సిఉంటుంది. దీనికోసం బీఎల్‌ఓలు క్లెయిమ్‌లు ఇచ్చుకున్నవారి ఇంటి వద్దకు వెళ్లి వారితో మాట్లాడి పక్కా సమాచారం తీసుకొని అపుడు సవరించాల్సి ఉంటుంది. ఈప్రక్రియను కలెక్టరు జిల్లాకేంద్రంలోని ఆర్కేనగర్, 6వరోడ్డు, ఎంజీకాలనీలలో పరిశీలించారు. అర్జీదారుల ఇళ్లవద్దకు వెళ్లి వారితో మాట్లాడారు. మీఇంటికి బీఎల్ఓలు వచ్చారా? మీకు ఓటు హక్కు ఎక్కడ కావాలి? తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొందరు ఇళ్ల వద్ద లేకపోవడంతో ఫోన్‌లో వీడియోకాల్ చేసి తాను కలెక్టర్‌నని, మీరు ఓటు మార్పుకు దరఖాస్తు చేసుకున్నారా? పరిశీలనకు బీఎల్‌ఓలు వచ్చారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతిక్లెయిమ్ ఇంటికి తప్పనిసరిగా వెళ్లి వారితో మాట్లాడిన తర్వాతనే సవరణలు చేయాలని, అందుకు విరుద్ధంగా చేశారని తెలిస్తే చర్యలు తప్పవని కలెక్టరు హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరికుమార్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఎస్టీ జాబితాలో చేర్చాలి: అంబికా



పార్లమెంటులో మాట్లాడుతున్న ఎంపీ

అనంతపురం అర్బన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పార్లమెంట్‌లో మంగళవారం కోరారు. 2017లో నాటి సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ఏపీ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిందని గుర్తు చేశారు. దాని ఆధారంగా తక్షణమే బోయ, వాల్మీకులకు న్యాయం చేయాలని కోరారు. గతంలో ప్రధాని నరేంద్రమోదీ వాల్మీకులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. బోయ, వాల్మీకులు ఒక ప్రాంతంలో బీసీలుగా మరో ప్రాంతంలో ఎస్టీలుగా ఉన్నారని, రాష్ట్రం అంతటా ఎస్టీలుగానే పరిగణించాలని కోరారు. వడ్డెర్లను కూడా ఎస్టీలుగా గుర్తించాలని కోరారు.

బైకులపై బాలల విన్యాసాలు

తల్లిదండ్రులకు పోలీసుల కౌన్సెలింగ్

అనంతపురం క్రైం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): బడికి వెళ్లే బాలలకు బైకులు ఇచ్చారు. పోలీసులు ప్రశ్నిస్తే.. 'ఏం చేయమంటారు సార్..? పిల్లలు మోజు పడుతున్నారు.. రేపొద్దున కాలేజీలకు వెళ్లాలి కదా..?' అని తల్లిదండ్రులు సమర్థించుకున్నారు. 'ఇలా చేయడం చట్ట విరుద్ధం..? ప్రమాదాలు జరిగితే నష్టపోయేది మీరే కదా..? ఇకపై ఇలా చేస్తే చర్యలు ఉంటాయి..' అని పోలీసులు హెచ్చరించి పంపించారు. నగరంలో ఇటీవల మైనర్ల బైక్ రైడింగ్ పెరిగిపోయింది. రోడ్ల మీద రయ్ రయ్‌మని దూసుకుపోతున్నారు. స్టంట్ మాస్టర్ల తరహాలో ఫీట్లు వేస్తున్నారు. ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టూటౌన్ పోలీసులు వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. సీఐ శ్రీకాంత్, ఎస్ఐలు రుష్యేంద్రబాబు, గౌస్‌పీరా తమ సిబ్బందితో విద్యుత్‌నగర్ సర్కిల్, కోర్టు రోడ్డు తదితర ప్రాంతాల్లో మంగళవారం తనిఖీలు చేశారు. రెండు, మూడు గంటల వ్యవధిలో 20 మంది బాలలను బైక్‌లో వెళుతుండగా పట్టుకున్నారు. త్రిబుల్ ఎస్ మహిళా కళాశాల ఎదుట స్టంట్లు చేస్తున్న కొందరిని, అతి వేగంగా వెళుతున్నవారిని పట్టుకున్నారు. అందరూ 14 నుంచి 17 ఏళ్లలోపువారు. టూటౌన్ స్టేషన్‌కు తరలించి, తల్లిదండ్రులను పిలిపించారు. బాలలకు బైకులు ఇవ్వడం సరికాదని సీఐ శ్రీకాంత్ గట్టిగా హెచ్చరించారు. ఒక్కొక్కరికి రూ.1035లు జరిమానా విధించారు. రెండోసారి బైక్‌పై కనిపిస్తే ఆర్టీఓ ఎదుట హాజరు పరిచి బండిని సీజ్ చేస్తామని, మూడోసారి క్రిమినల్ కేసు నమోదు చేస్తామని వార్నింగ్ ఇచ్చి పంపించారు.



వాహన తనిఖీల్లో పట్టుబడ్డ బాలలకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

పంటలకు చీడ పీడలు

పట్టించుకోని ఉద్యాన శాఖ అధికారులు



బసంపల్లిలో చీనీకి సోకిన తెగులు



తెగులు సోకిన ఆకు

శెట్టూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా సాగు చేసిన ఉద్యాన పంటలకు తెగుళ్ల సోకాయి. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతు న్నారు. మండలంలో రైతులు మామిడి పంటను దాదాపు వెయ్యి ఎకరాలు, చీనీ వంద ఎకరాలకు పైబడి, టమోటా 200 ఎకరాలకు పైగా సాగు చేస్తున్నారు. వీటితో పాటు సపోటా, దానిమ్మ, అల్ల నేరేడు, బీర తదితర పంటలు సాగు చేశారు. ప్రస్తుతం పొగమంచు విపరీతంగా ఉండటంతో మామిడికి తేనెమంచు పురుగు ఆశించింది. చీనీకి పచ్చ పురుగు, ఆకు మచ్చ తెగుతు సోకింది. టమోటాను కాయతొలుచు పురుగు, పచ్చపురుగు, మచ్చ తెగులు ఆశించాయి. వీటి నివారణకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే సంబంధిత శాఖ అధికారులు అందుబాటులో లేకపోవడంతో చీడపీడల నివారణకు ఎలాంటి మందులు వాడాలో తెలియక రైతులు ఎరువుల దుకాణదారులను ఆశ్రయిస్తున్నారు. వారిచ్చే సలహాలమేరకు పురుగు మందులు తెచ్చి పిచికారీ చేస్తున్నారు. అయినా తెగుళ్ల అదుపులోకి రాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. జిల్లా అధికారులు స్పందించి ఉద్యాన రైతులకు ఉద్యాన శాఖ అధికారులను అందుబాటులో ఉంచేవిధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అంతా హల్‌సెల్

శిక్షణ కార్యక్రమంలో సెల్ ఫోన్లతో బిజీ బిజీ

అందరూ సెల్‌ఫోన్‌లోనే కాలక్షేపం చేస్తుంటే మరి చెప్పేది వినేవారెవరు? శిక్షణ కార్యక్రమ ఉద్దేశ్యాన్ని నెరవేర్చేదెవరు? శిక్షణలో చెప్పేది వినకపోతే రేప్పొద్దున క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి వచ్చే సమస్యలను ఎలా పరిష్కరిస్తారు? ఇవన్నీ ఆ ఉద్యోగులకు ఏమీ పట్టలేదు. ఏదో కాలక్షేపానికి వచ్చాం అన్నట్లుగా సెల్‌ఫోన్ చూస్తూ ఉండిపోయారు. ఇదీ.. నార్పల ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం తీరు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం గ్రామాభివృద్ధి ప్రణాళిక, పేదరికం, బాల్యవివాహాల నిర్మూలనపై ఎంపీడీఓ ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గదిలో ఎంపీడీఓ శిక్షణ ఇస్తుండగా... వచ్చిన ఉద్యోగుల్లో ఎక్కువమంది కార్యక్రమాన్ని పక్కన పెట్టి సెల్ ఫోన్లతో బిజీబిజీగా కాలం గడిపారు. సదుద్దేశంతో పెట్టిన ఈ కార్యక్రమానికి హాజరైన కొందరు ఉద్యోగులు సెల్‌ఫోన్‌లో మునిగిపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఉన్నతాధికారులు కూడా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు సెల్‌ఫోన్ స్విచ్‌ఆఫ్ చేయిస్తే బాగుంటుందని పలువురు పేర్కొంటున్నారు.

- నార్పల





రీ సర్వేతో కొత్త కష్టాలు

రెవెన్యూ కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణ

పరిష్కరించలేకపోతున్న అధికారులు

గత ప్రభుత్వ వైఫల్యం వల్లే సమస్యలు

డీ.హీరేహాళ్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో అవగాహనారాహిత్యంతో చేసిన భూ రీసర్వేతో రైతులకు కొత్త సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలు పరిష్కరించుకోవడానికి రెవెన్యూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. మండలంలో 18 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. 13 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశారు. ఈ రీసర్వే జరిగిన ప్రతి గ్రామంలో రికార్డులు తప్పుల తడకగా నమోదు చేశారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రీసర్వే జరిగే సమయంలో అధికారులు, రైతులకు సమన్వయం లేకపోవడంతో చాలా ఇబ్బందులు తలెత్తాయి. చాలా గ్రామాల్లో రీసర్వే జరుగుతున్న విషయం కూడా రైతులకు తెలియకుండా ముగించేశారు. రీసర్వే ద్వారా వచ్చిన సమస్యలు పరిష్కరించాలని అధికారులకు మొరపెట్టుకుంటే .. సమస్య ఎలా పరిష్కరించాలో తెలియడం లేదని వారు సైతం వాపోతున్నారు.

ఎల్‌పీఎం ఖాతా నంబర్ల గందరగోళం

రీసర్వేకు ముందు ఖాతా, సర్వే నెంబర్ల ద్వారా రికార్డులు నమోదు చేసేవారు. రీసర్వే అనంతరం ఖాతా, ఎల్‌పీఎం నంబర్లు మాత్రమే కేటాయించారు. ఇక్కడే సమస్య ఉత్పన్నమైంది. ఒక కుటుంబంలో ఒకరు అంతకన్నా ఎక్కువ మంది పేరున భూమి ఉంటే వారికి సంబంధించిన యాజమాన్య రికార్డుల ప్రకారం ఒక్కొక్కరికి ఒక్కొక్క ఖాతా, ఒక ఎల్‌పీఎం కేటాయించాలి. అలా కాకుండా మొత్తం అందరికీ కలిపి ఒకే ఎల్‌పీఎం కేటాయించారు. దీంతో ఆ రైతులు తమ భూములను అమ్ముకోవడానికి లేదా వేరొకరి పేరు మీదకు బదలాయించేందుకు వీలు లేకుండా పోయింది. వేరొకరి పేరు మీద భూ యాజమాన్య హక్కు మార్చాలంటే కచ్చితంగా ప్రతి ఒక్కరికి ఒక ఎల్‌పీఎం ఉండాల్సిందే. కొంతమంది భూములు కొనుక్కున్న రైతులు రిజిస్ట్రేషన్ దస్తావేజుల ప్రకారం పట్టాదారు పాసుపుస్తకం పొందినా ప్రస్తుతం రీసర్వే జరిగిన గ్రామాలలో ఆన్‌లైన్‌లో గతంలో అమ్మిన వారి పేర్లే కనిపిస్తున్నాయి. దీంతో భూమికొన్న రైతులు లబోదిబోమంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించుకునేందుకు ప్రయత్నిస్తే రీసర్వే జరిగిన గ్రామాల్లో ఆన్‌లైన్ పని చేయడం లేదు. ఈక్రమంలో మార్పులు, చేర్పులకు అవకాశం కుదరడం లేదు. దీనికి సంబంధించి రెవెన్యూ అధికారులకు కూడా పూర్తి స్పష్టత లేదు.

కొత్త చిక్కులు వచ్చాయి



చాలా ఏళ్లుగా మా భూ రికార్డులు ఆన్‌లైన్‌లో ఉన్నాయి. ప్రతి ఏడాది ఏ సమస్యా లేకుండా అడంగల్ వచ్చేది. కానీ గత సంవత్సరం రీసర్వే చేసినప్పటి నుంచే కొత్త చిక్కులు వచ్చి పడ్డాయి. రీసర్వే అనంతరం భూ విస్తీర్ణంలో తేడాలు వచ్చాయి. ఎల్‌పీఎంలు ఖాతాలకు సంబంధించి అనేక సమస్యలు ఉత్పన్నమయ్యాయి. వీటిని మార్చుకోవడం కోసం చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కూటమి ప్రభుత్వమైనా రీసర్వే ద్వారా ఎదురైన సమస్యలు పరిష్కరించాలి.

- నాగరాజు, డి హీరేహాళ్

పాత రెవెన్యూ రికార్డులే నయం



గత ప్రభుత్వం చెప్పిన విధంగా రీసర్వేతో భూ సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని అనుకున్నాం. రీసర్వే జరిగిన తర్వాతే అసలు సమస్యలు ఎదురవుతున్నాయి. ఎల్‌పీఎం నంబర్ ఏమిటో అర్థం కావడం లేదు. గతంలో ఉన్న రెవెన్యూ రికార్డులే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేవి. ఏమైనా సమస్య వస్తే అధికారులు సులభంగా సమస్యను పరిష్కరించే అవకాశం ఉండేది. కానీ ఇప్పుడలా లేదు. రీసర్వే ప్రక్రియను పూర్తిగా రద్దు చేసి పాత రెవెన్యూ రికార్డులనే కొనసాగించాలి.

- నరసింహ, హిర్దేహాళ్

మార్పులు, చేర్పులకు వీలు పడటం లేదు



భూ రీసర్వే అనంతరం చాలా గ్రామాలలో భూ విస్తీర్ణంలో తేడాలు, ఎల్పీఎం నంబర్ల సమస్య ఉత్పన్నమయ్యాయి. వాటిని సరిదిద్దడం కోసం ప్రయత్నిస్తుంటే ఆన్‌లైన్‌లో వీలుకావడం లేదు. ఈ విషయం ఉన్నతాధికారులకు కూడా తెలియజేశాం. ప్రస్తుతం రీసర్వే ప్రక్రియ కూడా పూర్తిగా నిలిపివేశాం. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే సమస్య ఉంది. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల కోసం వేసి చూస్తున్నాం.

- అనిల్‌కుమార్, తహసీల్దార్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

పది విద్యార్థులకు ప్రత్యేక ప్రణాళిక

డీఈఓ ప్రసాద్‌బాబు



అనంతపురం విద్య, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తామని డీఈఓ ప్రసాద్ బాబు పేర్కొన్నారు. ముఖ్యంగా జిల్లాలో ఉన్నత పాఠశాల్లో నెలకొన్న సబ్జెక్ట్ టీచర్ల కొరతను అధిగమించడంతోపాటు స్టడీ మెటీరియల్ అందించడం తదితర అంశాలపై దృష్టి సారిస్తామని డీఈఓ మంగళవారం తెలిపారు.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో చాలా హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్ల కొరతను ఎలా పరిష్కరిస్తారు?

డీఈఓ: ఉన్నత పాఠశాలల్లో సుమారు 200 వరకూ సబ్జెక్టు టీచర్ల కొరత ఉంది. దీనిపై కసరత్తు చేస్తున్నాం. మరో వారం రోజుల్లో టీచర్ల కొరత సమస్యను పరిష్కరించి, సకాలంలో విద్యార్థులకు బోధన సాగేలా చూస్తాం.

ఆంధ్రజ్యోతి: టెన్త్ పరీక్షలకు ఎంత మంది ఇప్పటి వరకూ ఫీజు చెల్లించారు ?

డీఈఓ: జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ 32,913 మంది విద్యార్థులు ఫీజు చెల్లించారు. ఫైన్‌తో ఫీజు చెల్లింపునకు ఇంకా గడువు ఉండటంతో...ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

ఆంధ్రజ్యోతి: 10వ తరగతి విద్యార్థులకు గతంలో "అనంత సంకల్పం" మెటీరియల్ అందించేవారు. ఈ ఏడాది ఆ ప్రక్రియ ఎక్కడి వరకూ వచ్చింది..?

డీఈఓ: పదో తరగతి విద్యార్థులకు అందించే మెటీరియల్‌పై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. జిల్లా సాధారణ పరీక్షల మండలి (డీసీఈబీ) కార్యదర్శి, ఇతర సభ్యులతో త్వరలోనే చర్చిస్తాం. మెటీరియల్ ముద్రణ, ఇతర అంశాలపై ఒక నిర్ణయం తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: అపార్ ఐడీ జనరేషన్ జిల్లాలో ఎంత వరకూ వచ్చింది....?

డీఈఓ: జిల్లాలో అపార్ ఐడీల జనరేషన్ పారదర్శకంగా, కచ్చితత్వంతో చేసే దిశగా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే చాలా వరకూ పూర్తి చేశాం. కేవలం 90 వేల వరకూ పెండింగ్ ఉండే అవకాశం ఉంది. సాంకేతిక సమస్యలను అధిగమించి పెండింగ్ కూడా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: సమగ్రశిక్ష ప్రాజెక్టులో సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారుల ఖాళీలు ఎప్పుడు భర్తీ చేసే అవకాశం ఉంది..?

డీఈఓ: ప్రాజెక్టులో సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టుల భర్తీ ఫైల్‌ను ఇప్పటికే విద్యాశాఖ కమిషనర్, ఎస్పీడీకి కూడా తెలియజేశాం. సుమారు 10 రోజుల కిందటే రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కమిషనర్, ఎస్పీడీ నుంచి ఆదేశాలు రాగానే ఆ పోస్టుల భర్తీ చేస్తాం.

అంతా సీక్రెట్..!

గుట్టుగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్

పోస్టు భర్తీకి రేపు కంప్యూటర్ పరీక్షలు

అనంతపురం విద్య, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ పరిధిలోని బాలసదన్‌లో ఖాళీగా ఉన్న స్టోర్ కీపర్ కం అకౌంటెంట్ పోస్టు భర్తీపై గోప్యత పాటిస్తున్నారు. బాలసదన్‌లో ఖాళీగా ఉన్న ఒక కాంట్రాక్టు పోస్టుకు ఇటీవల దరఖాస్తులు స్వీకరించారు. 47 దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. అభ్యర్థులకు ఎప్పుడు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించారో తెలియడం లేదు. దరఖాస్తు చేసుకున్న వారిలో చాలా మందికి కనీస సమాచారం కూడా ఇవ్వకుండా గతంలో ఉన్న ఉన్నతాధికారులు గోప్యంగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను నిర్వహించినట్లు తెలిసింది. ఆఖరికి 18 మందిని ఎంపిక చేసి వారికి ఈ నెల 19న కంప్యూటర్ పరీక్షలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజ్ సమీపంలోని ఎల్లోరా బాయ్స్ హాస్టల్ పక్కన ఉన్న సెంట్రల్ కంప్యూటర్ సెంటర్‌లో గురువారం ఉదయం 10 గంటలకు అభ్యర్థులకు కంప్యూటర్ నైపుణ్య పరీక్షలు నిర్వహించే ఏర్పాట్లు చేశారు. దీనిపై పలువురు అభ్యర్థులు అనుమానం, అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ప్రీమియం లిక్కర్ స్టోర్ మంజూరు

31లోగా దరఖాస్తు చేసుకోవాలి: ఈఎస్

అనంతపురం అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా కేంద్రంలో ప్రీమియం లిక్కర్ స్టోర్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఐదేళ్ల కాల వ్యవధితో ప్రీమియం లిక్కర్ స్టోర్‌ను మంజూరు చేశారన్నారు. తొలి ఏడాదిలో లైసెన్స్‌దారులు రూ.కోటి వార్షిక పన్ను చెల్లించాలన్నారు. రెండో ఏడాది దానిపై 10 శాతం పెంచుతామన్నారు. ప్రీమియం లిక్కర్ స్టోర్ ఏర్పాటు కోసం కనీసం 4000 చదరపు అడుగులు వైశాల్యం ఉండాలన్నారు. ఈ స్టోర్‌లో ఐఎంఎఫ్ఎల్ కనీస ధర రూ.1200, బీర్ ధర రూ.400పైన ఉన్న స్టాక్ విక్రయాలు మాత్రమే జరుగుతాయన్నారు. స్టోర్‌లో మద్యపానం అనుమతించబడదన్నారు. మద్యం, సిగార్లు, సిగరెట్లు, మద్యానికి సంబంధించిన ఉపకరణాలు, శీతల పానీయాలను విక్రయించవచ్చునన్నారు. ప్రీమియం స్టోర్ ఏర్పాటుకు దరఖాస్తును https//apsbcl.ap.gov.inలో డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు ఫీజు రూ.15 లక్షలు నాన్ రిఫండబుల్ అన్నారు. ఈ డబ్బును డీడీ ద్వారా చెల్లించాలన్నారు. ఈనెల 31 సాయంత్రం 5 గంటల్లోగా అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో దరఖాస్తులను ఆఫ్‌లైన్ పద్ధతిలో నేరుగా సమర్పించాలని సూచించారు. దరఖాస్తులను రాష్ట్ర కమిషనర్‌కు పంపుతామని, రాష్ట్ర ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు ముందుకు వెళతామని తెలిపారు.

అంజన్న హుండీల ఆదాయం రూ.62.62 లక్షలు

గుంతకల్లు, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి వివిధ హుండీల ద్వారా రూ. 62.62 లక్షల ఆదాయం లభించింది. ఆలయంలోని హుండీలను మంగళవారం ఉదయం తెరచి సొమ్మును లెక్కించారు. సాయంత్రం వరకూ డబ్బును లెక్కగట్టగా ప్రధాన హుండీల ద్వారా రూ. 62,36,139లు, అన్నదానం హుండీ ద్వారా రూ. 26,206లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఏడు గ్రాముల ఒక మిల్లీ గ్రాము బంగారం, 1. 630 కిలోల వెండి వస్తువులు వచ్చినట్లు ఈఓ వాణి తెలిపారు. అలాగే 120 కెనడా డాలర్లు, 205 నేపాల్ రూపాయలు, 10 సౌదీ అరేబియా రియాళ్లు లభ్యమైనట్లు వివరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సుగుణమ్మ, అనంతపురం డివిజనల్ దేవదాయశాఖ తనిఖీ అధికారి వన్నూరు స్వామి, ఏఈఓ వెంకటేశ్వరుడు, సూపరింటెండెంటు వెంకటేశులు, అర్చకులు, సిబ్బంది వలంటీర్లు పాల్గొన్నారు.



హుండీల సొమ్మును లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, వలంటీర్లు

తస్మాత్ జాగ్రత్త

మాతాశిశుమరణాలు జరిగితే చర్యలు తప్పవు

డీఎంహెచ్ఓ హెచ్చరిక

అనంతపురం టౌన్, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): మాతాశిశు మరణాలు జరిగితే చర్యలు తప్పవని డాక్టర్లు, సిబ్బందిని డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీదేవి హెచ్చరించారు. జిల్లావైద్యశాఖ కార్యాలయంలో నవంబరు నెలలో జరిగిన మాతాశిశుమరణాలపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మాతృ మరణాలు 5, శిశుమరణాలు 5 ఎందుకు జరిగాయని ఆరా తీశారు. అనంతరం డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ఇపుడు కారణాలు చెప్పడంకాదు, మళ్లీ మీవద్ద ఇలాంటివి సంభవిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మాతాశిశుమరణాలు పూర్తిగా అరికట్టాలని ప్రభుత్వాలు అనేక పథకాలు, కార్యక్రమాలు తీసుకొచ్చిందన్నారు. అలాంటపుడు ఇంకా మరణాలు జరగుతుండటం దురదృష్టకరమన్నారు. గర్భిణులను గుర్తించిన తర్వాత నుంచి వారికి అవసరమైన వైద్యసేవలు అందించడంతో పాటు, పౌష్టికాహారం తీసుకునేలా చూడాలన్నారు. ప్రతినెలా పరీక్షించి అనారోగ్యంతో ఉంటున్నవారిని, రక్తహీనతతో బాధపడుతున్నవారిని గుర్తించి హైరిస్క్ కేసులుగా పరిగణించి, ప్రత్యేకంగా పర్యవేక్షించాలన్నారు. ప్రసవ సమయంలోను ముందుగానే ఆస్పత్రులకు పంపించాలన్నారు. నెలలు నిండకుండానే పుట్టిన శిశువులును వెంటనే ఎన్ఆర్‌సీలో చేర్పించి అవసరమైన వైద్యం అందించాలని ఆదేశించారు. డాక్టర్లు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, మరణాలు జరగకుండా చూడాలని డీఎంహెచ్ఓ ఆదేశించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ డాక్టరు యుగంధర్, అనస్తీషియా డాక్టరు నవీన్‌కుమార్, చిన్నపిల్లల వైద్య నిపుణులు శంకరనారాయణ, డాక్టర్లు పార్వతి, శ్రీనివాసులు, డీవీరాజు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



మాతాశిశుమరణాలపై సమీక్షిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి

డాక్టర్లకు ఐదుగుణాలే ఆభరణాలు

ఇస్కాన్ ఆధ్యాత్మిక ప్రవచనకర్త సత్యగోపీనాథ్ దాస్

అనంతపురం టౌన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): డాక్టర్లకు స్వచ్ఛమైన తెల్లటి దుస్తులు, చెరగని చిరునవ్వు, నిబ్బరం, అంకితభావం, విసుగులేకుండా సేవలు అందించడమనే ఈ ఐదు గుణాలే ఆభరణాలు అని ఇస్కాన్ ఆధ్యాత్మిక ప్రవచనకర్త సత్యగోపీనాథ్‌దాస్ పేర్కొన్నారు. రాష్ట్ర వైద్యశాఖ కమిషన్ కోరిక మేరకు మంగళవారం వైద్య కళాశాలలో డాక్టర్లు, నర్సులకు ఆచరణాత్మక కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి సత్యగోపీనాథ్ దాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రశాంతంగా ఉన్న డాక్టర్లు, సిబ్బందిని చూసినప్పుడే రోగులకు సగం రోగం తగ్గిపోతుందన్నారు. సామాజిక సంబంధాలు, మానవతా విలువలు మధ్య సమన్వయం పాటిస్తూ వృత్తి ధర్మాన్ని నిర్వహించాలన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులు, వారిసహాయకుల పట్ల ప్రేమగా మెలగాలని, డిశ్చార్జ్ అయ్యే వరకు ఎక్కడా ఏ లోటు రాకుండా చూసుకోవాలన్నారు. అపుడే మనపై మరింత గౌరవం పెరగడంతో పాటు ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం ఏర్పడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు మాణిక్యాలరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓలు డాక్టరు హేమలత, డాక్టరు పద్మజ డాక్టర్లు ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సత్యనాథ్ గోపీదాస్‌ను సత్కరిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్, ఆర్ఎంఓలు

ఈవీఎంలను పరిశీలించిన కలెక్టరు



ఈవీఎంల పరిశీలన అనంతరం గోడౌన్‌కు సీల్ వేయిస్తున్న కలెక్టరు

అనంతపురం టౌన్, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎంలను జిల్లా కలెక్టరు వినోద్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అధికారులు, రాజకీయపార్టీలతో కలిసి పాత ఆర్డీఓ ఆఫీస్ ఆవరణలోని గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎంలను పరిశీలించారు. అక్కడ ఈవీఎంలు భద్రంగా ఉన్నాయా? ఎలాంటి భద్రతా చర్యలు తీసుకుంటున్నారనే అంశాలను పరిశీలించారు. అనంతరం అందరి సమక్షంలోనే ఆ ఈవీఎంల గోడౌన్‌కు సీల్ వేయించారు. కార్యక్రమంలో డీఆర్ఓ మలోల, తహసీల్దార్ హరికుమార్, కలెక్టరేట్ సెక్షన్ ఆఫీసర్లు యుగేశ్వరి, కనకరాజు, దివాకరరావు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అన్నీ ఏకగ్రీవమే

సాగునీటి డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నిక



జీబీసీ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్‌గా ఎన్నికైన మారయ్య

అనంతపురం క్లాక్‌టవర్/విడపనకల్లు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా హెచ్చెల్సీ పరిధిలోని సాగునీటి సంఘాలు డిస్ట్రిబ్యూటరీ కమిటీలను మంగళవారం ఎన్నుకున్నారు. హెచ్‌ఎల్ఎంసీ అధ్యక్షుడిగా కొండాపురం కేశవరెడ్డి, ఉపాధ్యక్షులుగా గిరప్ప గారి రమేష్‌బాబు ఎన్నికయ్యారు. మిడ్‌పెన్నార్ సౌత్ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడిగా కొర్రపాటి శేఖర్, ఉపాధ్యక్షుడిగా కుమ్మెత చంద్రాయుడు ఎన్నికయ్యారు. మిడ్‌పెన్నార్ నార్త్‌కెనాల్ అధ్యక్షుడిగా రాజారెడ్డి, ఉపాధ్యక్షుడిగా మీనుగ వెంకటేష్ ఎన్నికయ్యారు. తాడిపత్రి బ్రాంచ్ కెనాల్ ప్రెసిడెంట్‌గా కుమ్మెత ప్రమీళమ్మ, ఉపాధ్యక్షులుగా సత్యనారాయణరెడ్డిని ఎన్నుకున్నారు. గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ అధ్యక్షుడుగా మారయ్య, ఉపాధ్యక్షులుగా అప్పా రామకృష్ణ, ఆలూరు బ్రాంచ్ కెనాల్ నగరడోన కిష్టప్ప, ఉపాధ్యక్షులుగా మీసాల రామాంజనేయులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హెచ్చెల్సీ పరిధిలోని ఆరు డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు అధికారపార్టీ మద్దతుదారులే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయా ప్రాజెక్టుల పరిధిలోనే ఎన్నికలు నిర్వహించినట్లు హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ తెలిపారు.

అర్హులందరికీ డ్రిప్ పరికరాలు

- ఏపీఎంఐపీ రాష్ట్ర ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటేశ్వర్లు

అనంతపురం అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హులైన రైతులందరికీ డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలు మంజూరు చేయాలని ఏపీఎంఐపీ రాష్ట్ర ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. గుంటూరు నుంచి మంగళవారం ఆయన అన్ని జిల్లాల ఏపీఎంఐపీ పీడీ, ఏపీడీ, డ్రిప్ కంపెనీల రాష్ట్ర కోఆర్డినేటర్లు, జిల్లా కో ఆర్డినేటర్లలతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో 42459 మంది రైతులు 58475 హెక్టార్లల్లో డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. ఇప్పటి దాకా 17850 మంది రైతులకు సంబంధించి 21809 హెక్టార్లల్లో ప్రాథమిక సర్వే పూర్తయిందన్నారు. వీరిలో 6568 మంది రైతులు 7731 హెక్టార్లకు రైతు వాటా డబ్బులు డిజిటల్ పద్ధతిలో చెల్లించారన్నారు. ఇందులో జిల్లా కలెక్టర్ 5794 మంది రైతులకు 6818 హెక్టార్లకు పరిపాలన ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు. ఇందులో ఇప్పటి దాకా 3611 మంది రైతులకు 4245 హెక్టార్లకు పరికరాలు సరఫరా చేసినట్లు వివరించారు. మిగిలిన రైతులకు త్వరగా డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలు సరఫరా చేయడంతోపాటు పొలాల్లో బిగించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్ రెడ్డి, ఏపీడీ ఫిరోజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



ఎస్ఎస్‌బీఎన్, పీవీకేకే జట్ల మధ్య మ్యాచ్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ అంతర్‌కళాశాల క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఎస్కేయూ అంతర్‌కళాశాలల క్రికెట్ పోటీలు రెండో రోజు మంగళవారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో కొనసాగాయి. పీవీకేకే కళాశాలపై ఎస్ఎస్‌బీఎన్ జట్టు గెలుపొందింది. కదిరి ఎస్‌టీఎస్ఎన్ కళాశాలపై తాడిపత్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు విజయం సాధించింది. గుంతకల్లు ప్రభుత్వ ఎస్‌కేపీ కళాశాల జట్టుపై అనంతపురం వివేకానంద కళాశాల, కళ్యాణదుర్గం ఎస్‌వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌పై గుంతకల్లు ఎస్ఎస్‌జీఎస్ డిగ్రీ కాలేజ్, పెనుకొండ పరిటాల డిగ్రీ కళాశాల జట్టుపై కదిరి బ్లూమూన్ డిగ్రీ కళాశాల జట్టు, ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలపై అనంతపురం ఆర్ట్స్ కాలేజ్ జట్లు గెలుపొందాయి. కార్యక్రమంలో ఎస్కేయూ స్పోర్ట్స్ సెక్రటరీ జెస్సీ, ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాల వైస్ చైర్మన్ చక్రధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఏఓ శ్రీనాథ్, ఆర్గనైజింగ్ డైరెక్టర్ శ్రీనివాసులునాయక్, పీడీలు శ్రీరామ్, జయరాం, ప్రసాద్, క్రీడాకారులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాలిటెక్నిక్ విద్యార్థులకు క్రీడాపోటీలు

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులకు బుధవారం నుంచి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్(ఐపీఎస్‌జీఎం-2024)ను నిర్వహిస్తున్నట్లు అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి తెలిపారు. ఈ పోటీలను అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ హాజరై ప్రారంభిస్తారని పేర్కొన్నారు. మూడు రోజులపాటు నిర్వహించే పోటీల్లో ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు పాల్గొంటారన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు వారి అవసరాల కోసం 9912342020, 7901620020 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

ఎన్నాళ్లకో... ఉల్లింత..!

- ఉల్లి సాగుతో లాభాల పంట
- సంతోషంలో పిన్నేపల్లి రైతులు
- ఎకరాకు రూ.3లక్షల వరకు ఆదాయం



పిన్నేపల్లి వద్ద సాగుచేసిన ఉల్లిపంట

యాడికి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో ధరలు బాగుండటంతో ఉల్లిసాగు చేసిన రైతులు లాభాలు కళ్లజూస్తున్నారు. పంట దిగుబడి అధికంగా రావడం, అదే సమయంలో ధరలు బాగా పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పిన్నేపల్లి గ్రామంలో సుమారు 150ఎకరాల్లో రైతులు ఉల్లి పంటను సాగుచేశారు. ఎకరాకు 120నుంచి 140ప్యాకెట్ల ఉల్లి దిగుబడి వచ్చింది. ఇదే సమయంలో ఉల్లిప్యాకెట్ (50కిలోలు) ధర రూ.2600 నుంచి గరిష్ఠంగా రూ.2800 వరకు పలకడంతో రైతుల్లో సంతోషం వ్యక్తం అవుతోంది. ఎకరా ఉల్లి సాగుకు దాదాపు రూ.30వేలు ఖర్చవుతున్నట్లు రైతులు చెబుతు న్నారు. ప్రస్తుతం దిగుబడి, ధర బాగుండటంతో ఎకరాకు రూ.3లక్షల వరకు ఆదాయం పొందుతున్నట్లు పలువురు రైతులు చెబుతున్నారు. ధరలు, దిగుబడి మరికొంత కాలం ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో పంట సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు.



మార్కెట్‌కు తరలించడానికి లోడింగ్ చేస్తున్న దృశ్యం

నారు నాటడం మాని... విత్తనం చల్లుతూ

సాధారణంగా రైతులు ఉల్లి పంట సాగు చేయాలంటే నారు పోసుకొని, లేదా కొనుగోలు చేసి నాటేవారు. దీనికి ఖర్చుతోపాటు కూలీల కొరత కూడా ఎక్కువగా ఉండేది. ఎక్కువ విస్తీర్ణంలో ఉల్లి సాగు చేయాలంటే రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం ఉల్లి నారు నాటడం కాకుండా ఉల్లి సాగుకు పొలాన్ని సిద్ధం చేసుకున్న తర్వాత విత్తనాలు చల్లే పద్ధతిని పాటిస్తున్నారు. నారు నాటడానికి, విత్తనం చల్లడానికి పెద్ద తేడా ఏమిలేదని ఉల్లి సాగు చేసిన రైతులు తెలిపారు. పైగా నారు నాటడానికి అయ్యే కూలీల ఖర్చు తగ్గిపోతుందని వారు చెబుతున్నారు. ఒక రోజులోనే ఒక వ్యక్తే ఎక్కువ ఎకరాల్లో ఉల్లి విత్తనాలు చల్లగలుగుతాడని పేర్కొంటున్నారు.

యాడికి టు చెన్నై

మండలంలోని యాడికి, పిన్నేపల్లి, కోనుప్పలపాడు, ఓబులాపురం, కత్తిమానుపల్లి, పచ్చారుమేకలపల్లి, లక్షుంపల్లి, రాయలచెరువు తదితర గ్రామాల్లో ఉల్లి సాగు చేస్తారు. పంట పండిన తర్వాత కోత కోస్తారు. దిగుబడిని వాహనాల్లో లోడ్ చేసుకుని సాయంత్రం వేళ చెన్నై మార్కెట్‌కు బయల్దేరుతారు. తెల్లవారుజామున మార్కెట్ ప్రారంభ సమయానికి అక్కడకు చేరుకుని విక్రయిస్తారు.

ఎకరాలో సాగు చేశా



ఈ ఏడాది ఒక ఎకరాలో ఉల్లి సాగుచేశా. నారు నాటకుండా విత్తనం చల్లించా. ఖర్చు తక్కువే. పంట సాగుకు మొత్తం రూ.30వేలు ఖర్చు అయింది. 115ప్యాకెట్ల దిగుబడి వచ్చింది. అన్ని ఖర్చులు పోను రూ.3లక్షల వరకు ఆదా యం వచ్చింది. పిన్నేపల్లి గ్రామంలో ఈ ఏడాది ఉల్లి సాగు మంచి లాభాలను తెచ్చి పెట్టింది.

- రామ్మోహన్, ఉల్లి రైతు, పిన్నేపల్లి

ఆరెకరాల్లో సాగు



నేను ఆరు ఎకరాల్లో ఉల్లిపంట సాగు చేశాను. ధరలు బాగా ఉన్నప్పుడు పంట దిగుబడి కూడా బాగా వచ్చింది. ఉల్లిప్యాకెట్ రూ.2200 నుంచి రూ.2800 వరకు పలికింది. ఆరు ఎకరాల్లో ఉల్లి దిగుబడికి రూ.22లక్షల ఆదాయం వచ్చింది. ధరలు ఎన్ని రోజులు నిలకడగా ఉంటాయో చెప్పలేము. ధరలు నిలకడగా ఉంటే ఉల్లి రైతుకు లాభమే.

- విశ్వేశ్వరరావు, ఉల్లి రైతు, పిన్నేపల్లి

క్రైం కార్నర్

ఆరేళ్ల తరువాత..!

అత్యాచారయత్నం కేసులో ఇద్దరు బిహారీల అరెస్టు

పరిగి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళపై అత్యాచారయత్నం కేసులో ఇద్దరు బిహారీలను పోలీసులు ఆరేళ్ల తరువాత అరెస్టు చేశారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నిందితుల అరెస్టు వివరాలను ఎస్‌ఐ రంగడు యాదవ్ వెల్లడించారు. బిహార్‌కు చెందిన యువకులు జోగి మాండల్ అలియాస్ జోగేంద్ర, దిలీప్ గతంలో మండలానికి వచ్చి, ఓ పరిశ్రమలో కార్మికులుగా పనిచేస్తుండేవారు. 2017 డిసెంబరు 17న మండలానికి చెందిన ఓ మహిళ పరిశ్రమ సమీపంలో పశువులు మేపుకుంటుండగా వీరిరువురు ఆమెపై అత్యాచారానికి యత్నించారు. అప్పట్లో కేసు నమోదైంది. అప్పటి నుంచి నిందితులు పరారీలో ఉన్నారు. ఈ నేపథ్యంలో బిహార్ రాష్ట్రానికి వెళ్లి, నిందితులను అరెస్టుచేసి తీసుకొచ్చినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

ధర్మవరంలో దొంగల హల్‌చల్

- నాలుగు దుకాణాల్లో చోరీ
- రూ.లక్ష నగదు, వస్త్రాల అపహరణ



సీసీ టీవీ ఫుటేజీలో దొంగలు

ధర్మవరం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. ప్రియాంకనగర్‌లో పుట్టపర్తి రహదారి పక్కనగల కాంప్లెక్స్‌లోని నాలుగు దుకాణాల్లో చోరీ చేశారు. షట్టర్లను ఇరువైపులా వంచి, తాళాలను పక్కకు జరిపి లోపలకు చొరబడ్డారు. ప్రభాకర్‌కు చెందిన ఆటో మొబైల్స్ షాపులో రూ.15వేలు, మహేశ్‌కు చెందిన హార్డ్‌వేర్ షాపులో రూ.20వేలు, నాగార్జునకు చెందిన పెయింట్స్ షాపులో రూ.50వేలు, పవన్‌కు చెందిన దుస్తుల దుకాణంలో రూ.15వేలు నగదుతోపాటు వస్త్రాలు, వస్తువులను ఎత్తికెళ్లినట్లు బాధితులు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు వన్‌టౌన్ పోలీసులు షాపులను పరిశీలించారు. సీసీ టీవీ ఫుటేజీని స్వాధీనం చేసుకున్నారు. అందులో ఇద్దరు దొంగలు మొహాలకు మాస్కులు వేసుకుని కనిపించారు. ఆ మేరకు ఇద్దరు అనుమానితులను పోలీసులు అదుపులోకి, తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. వారు హిందూపురం ప్రాంతానికి చెందిన వారని సమాచారం. పోలీసులు పట్టణంలో నిఘా పెంచి, రాత్రి సమయాల్లో గస్తీ నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

బాలుడి అదృశ్యం



కుటుంబ సభ్యులతో మహ్మద్ అల్మాన్ (వృత్తంలో..)

పెనుకొండ రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాబయ్యస్వామి దర్గాకు కుటుంబ సభ్యులతో వచ్చిన బాలుడు మహ్మద్ అల్మాన్(4) మంగళవారం అదృశ్యమైనట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. చిత్రదుర్గకు చెందిన జాఫర్.. భార్య, కుమారుడు మహ్మద్ అల్మాన్‌తో కలిసి మంగళవారం బాబయ్యస్వామి దర్గాకు వచ్చారు. దర్గా వెనుకవైపు షెడ్డులో ఆడుకుంటుండగా మహ్మద్ అల్మాన్ తప్పిపోయాడు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

టమోటా కిలో రూ.13

అనంతపురం రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.13తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మంగళవారం మార్కెట్‌కు 1050 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.7 పలికినట్లు తెలిపారు.

చీనీకాయలు టన్ను రూ.26,400

అనంతపురం రూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.26,400, కనిష్ఠంగా రూ.11వేలు, సరాసరి రూ.20వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 27 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

741 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు మంగళవారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 719 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 627 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

ఆ మృతదేహం రామాంజినమ్మదే..

- హత్యకేసులో నలుగురికి రిమాండ్

అనంతపురం క్రైం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పశుసంవర్థకశాఖలో అటెండర్‌గా పని చేస్తూ హత్యకు గురైన రామాంజినమ్మ కేసును అనంతపురం రూరల్ పోలీసులు ఛేదించారు. ఆ కేసులో నలుగురిని రిమాండ్‌కు తరలించారు. అయితే ఈ విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచారు. అక్టోబరు 17న రామాంజినమ్మ అదృశ్యం కావడం కలకలం రేపింది. అనంతరం 15రోజులకు ఆమె అదృశ్యమైనట్లు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో నిందితులు పట్టుబడ్డారు. మృతదేహం నవంబరు రెండోవారంలో కనిపించింది. ఆ మృతదేహం రామాంజినమ్మదా కాదా అనే అనుమానంతో పోలీసులు డీఎన్ఏ రిపోర్టుకు పంపారు. రిపోర్టులో మృతదేహం రామాంజినమ్మదేనని తేలడంతో నిందితులు కేశవ, క్రిష్ణ, మోహన్, గంగాధర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు.

చైన్ స్నాచింగ్

అనంతపురం క్రైం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): అనంతపురం రూరల్ మండల పరిధిలో ఓ చైన్‌స్నాచింగ్ జరిగింది. లలితానగర్‌కు చెందిన హేమలత కిరాణాదుకాణం, వాటర్ ప్లాంట్ నిర్వహిస్తోంది. ఓ ఫంక్షన్‌కు వెళ్లి మంగళవారం తిరిగి దుకాణానికి వచ్చింది. ఓ వ్యక్తి సిగరెట్లు కావాలని అడిగాడు. ఆమె సిగరెట్ల కోసం కిందకు వంగే ప్రయత్నం చేయగానే ఆమె మెడలోని ఒక టిన్నర తులాల బంగారు గొలుసు లాక్కుని పరారయ్యాడు. సాయంత్రం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

హత్య కేసులో ముగ్గురి అరెస్ట్

రాయదుర్గంరూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని చదుం గ్రామంలో ఈ నెల 10న పొలం గట్టు వివాదంలో గంగాధర మృతికి కారణమైన శివ, వంశీ, సూర్యలను అరెస్టు చేసినట్లు సీఐ జయనాయక్ మంగళవారం తెలిపారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో హత్యకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. సీఐ మాట్లాడుతూ చదుం గ్రామానికి చెందిన దొణప్ప, చిన్న గంగప్ప, పెద్ద గంగప్పకు మూడు ఎకరాల పొలం ఉంది. పొలం గట్టు వివాదంలో దొనప్ప కుమారుడు గంగాధర్‌కు చిన్న గంగప్ప కుమారుడు శివ, పెద్ద కుమారుడు వంశీ, సూర్యలతో గొడవ ఉండేది. పొలం వివాదంలో అడ్డొస్తున్నాడని మనసులో పెట్టుకొని పదో తేదీ మధ్యాహ్నం తల్లి రుద్రమ్మతో కలిసి గంగాధర్ పొలంలో పని చేస్తుండగా ముగ్గురు కలిసి కర్రలతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన గంగాధర్‌ను రాయదుర్గం ఆసుపత్రికి తరలిం చారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బళ్లారి ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. తల్లి రుద్రమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ముగ్గురిని సోమవారం పట్టణ శివారులోని గాలి మారమ్మ గుడి వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

వైసీపీ కో-ఆప్షన్ సభ్యుడిపై ఫిర్యాదు



సీఐకి ఫిర్యాదు చేస్తున్న టీడీపీ మైనార్టీ నాయకులు

గుంతకల్లు టౌన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ కోఆప్షన్‌సభ్యుడు ఫ్లయింగ్ మహబూబ్ బాషాపై మంగళవారం రాత్రి టీడీపీ మైనార్టీ నాయకులు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నాలుగు రోజుల కిందట అనంతపురం వైసీపీ నాయకులు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఫ్లయింగ్ మహబూబ్ బాషా ఓ సోషల్ మీడియాకు ఇంటర్వ్యూ ఇస్తూ సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశాడని వన్‌టౌన్ సీఐ మనోహర్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే నారా బ్రాహ్మణిపై తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లాకు చెందిన అంజిపురం విజయ్‌కుమార్ సోషల్ మీడియాలో అనుచితమైన పోస్ట్ పెట్టాడు. నాలుగు రోజుల కిందట టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో విజయ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని మంగళవారం రాత్రి గుంతకల్లుకు తీసుకువచ్చారు. ఇతడిపై కేసు నమోదు చేసి 41నోటీసులు ఇచ్చి పంపించినట్లు పోలీసులు తెలిపారు.

రాయదుర్గం-బళ్లారి మీదుగా కుంభమేళా ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రయాగరాజ్ కుంభమేళాను పురస్కరించుకుని జిల్లాలోని రాయదుర్గం, కర్ణాటకలోని బళ్లారి మీదుగా ప్రత్యేక రైళ్లను నడపనున్నారు. మైసూరు-దానాపూర్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ (నం. 06207) రైలు జనవరి 18, ఫిబ్రవరి 15, మార్చి 1న (శనివారాలలో) మైసూరులో సాయంత్రం నాలుగున్నరకు బయలుదేరి మూడు రోజుల తర్వాత మంగళవారం ఉదయం 10 గంటలకు దానాపూర్‌కు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 06208) జనవరి 22, ఫిబ్రవరి 19, మార్చి 5న (బుధవారాలలో) దానాపూర్‌లో తెల్లవారుజామున 1-45 గంటలకు బయలుదేరి శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు మైసూరుకు చేరుకుంటుందన్నారు. ఈ రైలు మాండ్య, మద్దూరు, కెంగెరి, కేఎస్ఆర్ బెంగళూరు, యశ్వంతపూర్, టుముకూరు, అరిసికెరె, చిగ్జాజుజుర్, చిత్రదుర్గ, రాయదుర్గ, బళ్లారి కంటోన్మెంటు, హోస్పేట, కొప్పల్, గదగ్, హుబ్లి, బాదామి, బాగల్‌కోట్, విజయపుర, షోలాపూర్, కురుద్వాడి, దౌండ్, అహ్మదానగర్, కోపర్‌గావ్, మన్మాడ్, భుసావల్, ఖండ్వా, తల్వాడ్యా, చనేర, ఖిర్కియా, హర్దా, బాణాపుర, ఇటార్సి, పిప్రియ, నరసింగ్‌పూర్, జబల్‌పూర్, కట్ని, మైహర్, సట్నా, మానిక్‌పూర్, ప్రయాగరాజ్ చౌకీ, మీర్జాపూర్, చునర్, దీన్‌దయాల్ ఉపాధ్యాయ జంక్షన్, బక్సర్, ఆర స్టేషన్ల మీదుగా వెళ్తుందని రైల్వే అధికారులు తెలిపారు.

జైళ్ల నుంచి వృద్ధులకు విముక్తి

- డీఎల్ఎస్ఏ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి

కదిరి లీగల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): జైళ్లలో ఏళ్లుగా మగ్గిపోతున్న వయోవృద్ధులకు విముక్తి కల్పించాలని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం శ్రీకారం చుట్టిందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం కదిరి సబ్‌జైలును తనిఖీ చేశారు. సబ్‌జైలులో ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలు, అందుతున్న ఆహార నియమాలు, ఆరోగ్య అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో కార్యదర్శి మాట్లాడుతూ.. సబ్‌జైలులో ఉంటూ 70 పదుల వయసు దాటినా బయటకు వచ్చే పరిస్థితిలేని వారి కోసం ఉన్నత న్యాయస్థానం మార్గనిర్దేశాలను జారీ చేసిందన్నారు. వయోవృద్ధుల జాబితాలను తయారు చేయమని ఆదేశించిందన్నారు. అనారోగ్యం బారినపడి ఆఖరి దశలో ఉన్న వారి వివరాలను కూడా ఇవ్వాలని ఆదేశించినట్లు చెప్పారు. అలాంటి వారిపై కమిటీ వేసి, వారి పరిస్థితుల దృష్ట్యా సొంత పూచీకత్తుపై విడుదల చేయడమా, మరో మార్గాన్ని అన్వేషించడంలో భాగంగానే తనిఖీ చేస్తున్నామన్నారు. ఉన్నత న్యాయస్థానం ఆదేశాలతో ఏళ్లుగా జైళ్లలో ఉంటున్న 70 ఏళ్ల దాటిన, అనారోగ్య పీడితులకు విముక్తి కలిగి, ఊరట లభించగలదన్నారు.

హామీని నిలబెట్టుకుంటాం

- పెన్షనర్ల దినోత్సవంలో ఎమ్మెల్యే దగ్గుపాటి
- ఘనంగా అఖిల భారత పెన్షనర్ల దినోత్సవం




మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పెన్షనర్లకు ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. లలితకళాపరిషత్‌లో అఖిలభారత పెన్షనర్ల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దనగౌడ్ అధ్యక్షత జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు ఆంధ్రా పెన్షనర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పాళంకి సుబ్బరాయన్, కార్యదర్శులు పీఎస్ఎన్ మూర్తి, సతీష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా పెన్షనర్ల ఉద్యమ నాయకుడు దివంగత నకారా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసిన వారికి సముచితమైన గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుందన్నారు. ఎమ్మెల్యేగా తన గెలుపులో పెన్షనర్ల పాత్రను ఎప్పటికీ మరువలేనన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు టీడీపీ ఎప్పుడూ సానుకూలంగా ఉంటుందన్నారు. ఆంధ్రా పెన్షనర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పాళంకి సుబ్బరాయన్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. వైసీపీ చర్యలతో విసిగిపోయి ఆంధ్రా పెన్షనర్స్ పార్టీ ఏర్పాటు చేసి, అన్ని జిల్లాలో ఆపార్టీకి వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించామన్నారు. సీఎం చంద్రబాబు తమ సమస్యల పట్ల సానుకూలత వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఆంధ్రా పెన్షనర్స్ పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పెద్దనగౌడ్ మాట్లాడుతూ 2018 నుంచి పెండింగ్‌లో ఉన్న అరియర్స్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. పీఆర్సీపై కమిషన్‌ను ఏర్పాటు చేసి ఐఆర్‌ను ప్రకటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కరువు భత్యాన్ని విడుదల చేసి ఆదుకోవాలన్నారు. అనంతరం 75 సంవత్సరాలు నిండిన పలువురు పెన్షనర్లను సన్మానించారు. కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా నుంచి దాదాపు 1500 మందికిపైగా పెన్షనర్లు హాజరయ్యారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం జిల్లా సలహాదారులు డి. గోవిందరాజులు, కోశాధికారి రామకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రభాకర్, సంయుక్త కార్యదర్శులు ఎస్ఎస్ వరదరాజులు, దివాకర్, పెన్షనర్లు మహమ్మద్, రమేష్‌కుమార్, పుల్లప్ప, చంద్రశేఖర్‌రెడ్డి, అనంతయ్య, నారాయణ స్వామి, నాగరాజేశ్వరీ, సావిత్రిదేవి, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్వాహాపై చర్యలేవి..?

ఉచిత మోటార్లను అమ్ముకున్న సాంబా మేనమామ



- రూ.50 లక్షలకుపైగా సొమ్ము చేసుకున్న వైనం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అప్పటి అధికారులు
- కూటమి ప్రభుత్వంలో చర్యల కోసం డిమాండ్

శింగనమల, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు ఉచితంగా మంజూరు చేసిన వ్యవసాయ మోటార్లను మాయం చేసిన వైసీపీ నాయకుడిపై చర్యలు తీసుకోవడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. వైసీపీ అధికారంలోని రాగానే ఆపార్టీ నాయకుడు ఆలూరు సాంబశివారెడ్డి మేన మామ రైతులకు సంబంధించిన ఉచిత వ్యవసాయ మోటార్లను అమ్ముకొని రూ.అరకోటికిపైగా సొమ్ము చేసుకున్నాడు. అప్పట్లో రైతులు, రైతు సంఘాలు, ప్రజా సంఘాలు ఎన్ని సార్లు ఫిర్యాదులు చేసిన అధికారులు పట్టించుకోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటంతో అమ్ముకున్న వ్యవసాయ మోటార్ల రికవరీకిపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

300 మోటార్లు మంజూరు

గత టీడీపీ ప్రభుత్వం రైతుల నుంచి పాత వ్యవసాయ మోటార్లు తీసుకుని కొత్తవి ఇవ్వడానికి సంకల్పించింది. ఇందులో భాగంగా మండలంలో 1050 మంది రైతులకు 5 హెచ్‌పీ మోటార్లను మంజూరు చేసింది. ఈక్రమంలోనే తొలి విడతగా 300 మోటార్లను శింగనమలలోని స్టాక్ పాయింట్‌కు చేర్చారు. అయితే ఈ మోటార్లను పంపిణీ చేస్తే మిగిలిన రైతులు గొడవలు పడతారన్న ఉద్దేశ్యంతో విద్యుత్‌శాఖ అధికారులు పంపిణీ చేయలేదు. ఈక్రమంలో ఆరు నెలలు గడిచి పోయాయి. తరువాత ఎన్నికల కోడ్ రావడంతో రైతులకు పంపిణీ చేయకుండా అలాగే ఉంచేశారు. ఎన్నికల తర్వాత వైసీపీ అధికారంలోకి రావడంతో మోటార్ల విషయం మరచిపోయారు.

అమ్మేసిన వైసీపీ నాయకుడు

వైసీపీ అధికారంలోకి రాగానే ఆలూరు సాంబశివారెడ్డి మేనమామ ఈ ఉచిత మోటార్లపై కన్నేశాడు. అనుకున్నదే తడవుగా కొందరు విద్యుత్ అధికారులు సాయంతో 297 మోటార్లను స్టాక్ పాయింట్ నుంచి తన స్వగ్రామం ఈస్టు నరసాపురంలోని పాత పాఠశాలకు చేర్చాడు. అప్పటి నుంచి వీలు కుదిరినప్పుడట్లా అనంతపురంలో ఉన్న తన బంధువుల షాపు ద్వారా మోటారు స్టార్టర్ రూ.30 వేల నుంచి 40 వేలు వరకు అమ్మి సొమ్ము చేసుకున్నాడు. మోటార్లు అమ్మిన మొత్తం ఎంత తక్కువ అనుకున్నా అరకోటికి పైగా ఉంటుందని పలువురు రైతులు పేర్కొంటున్నారు.

విద్యుత్ అధికారుల వింత వాదన

మండలంలోకి 300 ఉచిత వ్యవసాయ మోటర్లు రావడం నిజమేనని, అయితే ఈ విషయంలో తమకు సంబంధంలేదని, మోటార్లు కాంట్రాక్టర్‌కే సంబంధం అంటూ విద్యుత్ అధికారులు చెబుతున్నారు. మోటార్ల మాయం వెనుక అప్పటి మండల విద్యుత్ అధికారి వైసీపీ నాయకుడికి పూర్తిగా సహకరించినట్లు సమాచారం. కాంట్రాక్టర్‌కు మోటార్లు సంబంధించిన బిల్లులు ఇంకా రాలేదని అధికారుల సమాచారం. మోటార్లు అమ్ముకుని సొమ్ము చేసుకున్న వైసీపీ నాయకుడితో రికవరీ చేయాలనే డిమాండ్లు వినవస్తున్నాయి.

మోటార్ల గురించి తెలియదు: విజయ్‌కుమార్, విద్యుత్ ఏఈ

నేను నూతనంగా ఏఈగా బాధ్యతలు చేపట్టా. ఉచిత మోటార్లపై నాకు ఏమీ తెలియదు. గతంలో ఇక్కడ పని చేసిన ఏఈలు మోటార్ల రికార్డులు కార్యాలయంలో ఉంచలేదు. సమగ్ర రికార్డులు లేకపోవడంతో ఉచిత మోటార్లు ఎన్ని వచ్చాయనే వివరాలు లేవు.

క్రిమినల్ కేసు పెట్టాలి



శింగనమల మండల వైసీపీ నాయకుడు బొమ్మన శ్రీరామిరెడ్డి రైతులకు సంబంధించిన ఉచిత వ్యవసాయ మోటార్లను అమ్ముకుని సొమ్ము చేసుకున్నాడు. రైతులను నిలువునా మోసం చేశాడు. అప్పటిలో అధికారులకు ఫిర్యాదు చేసినా ఉపయోగం లేకపోయింది. కూటమి ప్రభుత్వమైనా వైసీపీ నాయకుడిపై విచారణ చేసి, రైతులు మోటార్లు అమ్ముకున్నందుకు క్రిమినల్ కేసు నమోదు చేయాలి.

-చిన్న ఆంజనేయులు, ఎమ్మార్పీఎస్ నాయకుడు

దర్జాగా తిరుగుతున్నాడు



ఉచిత మోటార్లు అమ్మి సొమ్ము చేసుకున్న వైసీపీ నాయకుడు దర్జాగా తిరుగుతున్నాడు. రైతులకు సంబంధించిన మోటార్లు అమ్ముకోవడంపై పలుమార్లు అధికారులు, అప్పటి ప్రజాపతినిధులకు తెలిపినా వారు పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వమైనా రైతులకు అందాల్సిన ఉచిత మోటార్లును వైసీపీ నాయకుడి నుంచి రికవరీ చేసి రైతులకు ఇవ్వాలి.

- చిన్నప్పయాదవ్, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

చర్యలు తప్పవు



మండల రైతులకు వచ్చిన 300 ఉచిత వ్యవసాయ మోటార్లను మండల వైసీపీ నాయకుడు అమ్ముకొని సొమ్ము చేసుకున్నాడు. మోటార్లు అమ్ముకున్న ఆ నాయకుడిపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం. విచారణ చేయించి ఆ నాయకుడిపై చర్యలు తీసుకునే విధంగా ముందుకు వెళతాం.

- అనంత చౌదరి, తెలుగు రైతు జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి

సంక్షిప్తం

కలెక్టర్ దృష్టికి నగర సమస్యలు

అనంతపురం అర్బన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): నగరంలో నెలకొన్న సమస్యలను కలెక్టర్ వినోద్‌కుమార్ దృష్టికి అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ తీసుకువెళ్లారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్‌ను ఎమ్మెల్యే కలిశారు. కౌన్సిల్ సమావేశంలో చర్చించిన అంశాలను ఆయనకు వివరించారు. ప్రధానంగా డంపింగ్ యార్డు సమస్య, మరువ వంక, నడిమి వంకల ప్రొటెక్షన్ వాల్స్ నిర్మాణం, సెంట్రల్ పార్క్ స్థలం పరిరక్షణ, డ్రైనేజీ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. అంతకు ముందు కలెక్టర్‌కు ఆయన జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

గార్లదిన్నె, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడనున్నట్లు ఆ శాఖ ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు. సబ్‌స్టేషన్, లైన్లు, విద్యుత్ స్తంభాల పరమ్మతుల కోసం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. రైతులు, ప్రజలు సహకరించాలన్నారు.

చెన్నేకొత్తపల్లి : మండలంలోని ఎన్ఎస్‌గేట్, హరియన్‌చెరువు, వెంకటంపల్లి, మేడాపురం విద్యుత్‌సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రామాంజనేయులు ఓ ప్రకటనలో తెలిపారు. రామగిరి 220కేవీ సబ్‌స్టేషన్లో మరమ్మతుల కారణంగా ఉదయం 10 గంటలనుంచి సాయంత్రం 5 గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

వాటర్‌షెడ్ పనులతో భూగర్భజలాల పెంపు



ఎమ్మెల్యేని కలిసిన వాటర్ షెడ్ కమిటీ సభ్యులు

శింగనమల, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వాటర్‌షెడ్, ఫాంపాండ్ ద్వారా భూగర్భజలాలు పెరుగుతాయని, రైతులు సద్వియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. మంగళవారం మండలంలోని వెస్టునరసాపురం వాటర్ షెడ్ చైర్మన్‌గా దాదే కృష్ణారెడ్డి ఏకగ్రీవం కావడంతో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా వాటర్ షెడ్ కమిటీ సభ్యులు కలిశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ షాలిని, చితంబరిదొర, వీరనారాయణ, ధనుంజయ, వెంకటరమణ, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

చెరువులను నింపాలి

గార్లదిన్నె, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉన్న అన్ని చెరువులను నీటితో నింపాలని రాయలసీమ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అక్బర్ డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ బండారు ఈరమ్మను రాయలసీమ రైతు సంఘం నాయకులు కలిశారు. ఈ సందర్భంగా అక్బర్ మాట్లాడుతూ... మండలంలో ఉన్న చెరువులకు నీరు నింపితే భూగర్భ జలాలు వృద్ధి చెంది బోరుబావుల్లో నీరు పుష్కలంగా వస్తాయన్నారు. ముఖ్యంగా పీఏబీఆర్ ద్వారా యర్రగుంట్ల, కోటంక చెరువులకు నీరు విడుదల చేయాలని కోరారు. గార్లదిన్నె నుంచి కోటంక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయం వరకు రోడ్డు నిర్మించాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్‌కు అందచేశారు. కార్యక్రమంలో నాయకులు పాపిరెడ్డి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయండి



ఈఓఆర్డీకి వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

నార్పల, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓఆర్డీ శైలజరాణికి మంగళవారం సీపీఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ నార్పల మండల తపాలా కార్యాలయంలో ఒక్కటే ఆధార్ సెంటర్ ఉండటం వల్ల మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారన్నారు. మరో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేసి ప్రజల కష్టాలను తీర్చాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గంగాధర, రామాంజి, రమేష్, పెద్దపెద్దయ్య, సుధాకర్, నారాయణప్ప పాల్గొన్నారు.

హాస్టల్ భవనాన్ని కాపాడండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): సాయినగర్‌లోని ఎస్సీ హాస్టల్ భవనాన్ని ఆక్రమణదారుల చెర నుంచి కాపాడాలని ఎస్సీ, ఎస్టీ ఫోరం నేతలు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆ ఫోరం జిల్లా అధ్యక్షుడు నెరిమెట్ల ఎల్లన్న, ఎంఎస్ఎఫ్ నగేష్ ఎస్సీ వెల్ఫేర్ సూపరింటెండెంట్ రవికాంత్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సాయినగర్‌లో ఉన్న ఎస్సీ హాస్టల్ భవనానికి సంబంధించిన స్థలాన్ని దాత యర్రమల కొండప్ప దళితుల అభివృద్ధి కోసం రెండు ఎకరాలు దానంగా ఇచ్చారన్నారు. అందులో 80 సెంట్లలో అంబేడ్కర్ భవన్, మిగిలిన స్థలంలో హాస్టల్ భవనం నిర్మించారన్నారు. కొందరు ఆక్రమణదారులు ఆ హాస్టల్ భవనం చుట్టూ కంచె వేశారన్నారు. వెంటనే ఈ విషయంలో అధికారులు చొరవ తీసుకొని హాస్టల్ భవన స్థలాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, చార్లెస్ పాల్గొన్నారు.



సూపరింటెండెంట్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

కౌన్సిల్ సమావేశం గరం.. గరం

● సమస్యలపై సభ్యుల గళం ● ప్రశ్నలు సంధించిన ఎమ్మెల్యే దగ్గుపాటి ● అక్రమ కట్టడాలపై భగ్గుమన్న సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఆంధ్రజ్యోతి కథనాన్ని చూపుతున్న కార్పొరేటర్ సాకే చంద్రశేఖర్, రసాభాసగా సమావేశం, మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): నగరపాలిక కౌన్సిల్ సమావేశం మంగళవారం వాడి వేడిగా సాగింది. వివిధ సమస్యలపై సభ్యులు గళమెత్తారు. వీధి కుక్కల నుంచి అక్రమ కట్టడాల వరకు అనేక సమస్యలపై కార్పొరేటర్లు ప్రశ్నించారు. నగర మేయర్ మహమ్మద్ వసీం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, కమిషనర్ రామలింగేశ్వర్, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు. తొలుత గంట పాటు అజెండా చదవడం, కార్పొరేటర్లు ఒకరికొకరు విమర్శలతో రసాభాసగా సాగింది. అనంతరం సమస్యలపైనే చర్చించారు. ఎమ్మెల్యే ప్రసాద్ కొన్ని సమస్యలకు సమాధానమిస్తూ...కొన్ని సమస్యలపై తాను ప్రశ్నలు సంధించారు.

కార్పొరేటర్లనే కుక్కలు కరిచినా పట్టించుకోరా...?

సమావేశం ఆరంభంలో అజెండా చదువుతున్న క్రమంలోనే ఔట్‌సోర్సింగ్ కార్మికుల వేతన పెంపుపై చర్చ మొదలైంది. 22 మందికే వేతనం ఎందుకు పెంచుతారని, మొత్తం 309 మందికి పెంచాలని కార్పొరేటర్లు సైఫుల్లా, బాలాంజనేయులు డిమాండ్ చేశారు. అందరికీ వేతనం పెంచేలా తీర్మానం చేద్దామని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. అనంతరం కుక్కల సమస్యలపై చర్చ ఆరంభమైంది. అనిమల్ బర్త్ కంట్రోల్ పేరుతో కుక్కలకు ఆపరేషన్ చేశామని రూ.14లక్షల చెక్కు ఎలా ఇచ్చారని కార్పొరేటర్లు ప్రశ్నించారు. ఎంహెచ్‌ఓ విష్ణుమూర్తి రికార్డు కరెక్ట్‌గా ఉందని చెప్పగా సభ్యులు అబుసాలెహ మాట్లాడుతూ... రికార్డ్ కరెక్ట్‌గా ఉందని ఎలా చెబుతారన్నారు. తమ డివిజన్‌లో ఒక్క కుక్కపిల్లను పట్టలేదని, కుక్కలు పిల్లలను ఈనుతుంటే ఆపరేషన్ ఏం చేసినట్లని ప్రశ్నించారు. కార్పొరేటర్లు లాలు, రహంతుల్లాను కూడా కుక్కలు కరిచాయని తెలిపారు.

మరో సమావేశానికి కమిషనర్ ఉంటారా...?

కార్పొరేటర్ దుర్గాదేవి మాట్లాడుతూ...సమావేశానికి రావడం..పోవడం తప్ప నెరవేరిందేమీ లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కోఆప్షన్ సభ్యురాలు ఉమామహేశ్వరి మాట్లాడుతూ... ఈ కమిషనర్ మరో కౌన్సిల్ మీటింగ్‌కు ఉంటారా..? అని అనుమానం వ్యక్తం చేశారు. కోఆప్షన్ సభ్యుడు లక్ష్మీరెడ్డి మాటాడుతూ...డిప్యూటీ మేయర్ డివిజన్‌లో శానిటేషన్ బాగుంటుందని, ఆయన తిరుగుతుండటం వల్లే అది జరుగుతోందన్నారు. మేయర్, డిప్యూటీ మేయర్లు నగరమంతా తిరగడం లేదన్నారు. సభ్యుడు అబూసాలెహ్ మాట్లాడుతూ... కోఆప్షన్ సభ్యులు కార్పొరేటర్ల కంటే ఎక్కువ మాట్లాడుతున్నారని, వారికేం హక్కు ఉందన్నారు. దీంతో లక్ష్మీరెడ్డి నేరుగా మేయర్ వద్దకు వెళ్లి కోఆప్షన్ సభ్యులకు మాట్లాడే హక్కు లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనను అవమానించారని, వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించి బయటకు వెళ్లిపోయారు. ఎమ్మెల్యే ప్రసాద్ మాట్లాడుతూ.. పారిశుధ్య సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఎంహెచ్‌ఓ పని చేయకపోతే ఆ బాధ్యత కమిషనర్‌పై పడుతుందన్నారు.

కబ్జాలపై చర్యలు : ఎమ్మెల్యే

కార్పొరేటర్ సైఫుల్లా మాట్లాడుతూ... కార్పొరేషన్‌కు చెందిన పండమేరు పరిధిలో జగనన్న కాలనీ పేరును టీడీపీ నేతల పేర్లతో ఏర్పాటు చేశారన్నారు. అక్కడ పట్టాలను ఆక్రమించుకుంటున్నారన్నారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ తమ ప్రభుత్వంలో ఎలాంటి ఆక్రమణలు జరగలేదని, వైసీపీ ప్రభుత్వంలో జరిగాయన్నారు. అక్కడ మాజీ ఎంపీటీసీ ఇళ్ల పట్టాలను అమ్మినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. అక్కడ మొత్తం 170 ఎకరాలు కార్పొరేషన్ స్థలం ఉందని, అలాంటి స్థలం ఆక్రమణకు గురవుతుంటే మీరేం చేశారని ప్రశ్నించారు. ఇందుకు మేయర్ వసీం, సైఫుల్లా స్పందిస్తూ వైసీపీ హయాంలో ఆక్రమణలు జరగలేదని గత నాలుగు నెలలుగా జరుగుతున్నాయన్నారు. అపార్ట్‌మెంట్లకు ఎన్నింటికి అక్రమంగా నీటి కనెక్షన్లు ఇచ్చారో స్పష్టం చేయాలని బాలాంజనేయులు డిమాండ్ చేశారు. డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య మాట్లాడుతూ...ఓపెన్ స్పేస్‌లలో ప్రహరీలు కట్టి కాపాడాలని కోరారు.

అక్రమ భవనాలపై సీరియస్...

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విభాగాల వారిగా అవినీతి, సమస్యలపై ప్రస్తావించారు. నగరంలో అక్రమ కట్టడాలపై ఎన్నింటిపై చర్యలు తీసు కున్నారు..? ఎన్నింటికి నోటీసులిచ్చారు.? ఎన్ని సెల్లార్లు అనుమతి లేకుండా నిర్మించారని ప్రశ్నించారు. ఇందుకు ఏసీపీ శ్రీనివాసులు మాట్లాడుతూ... 4,300 నోటీసులిచ్చామని, 353 భవనాలపై చార్జిషీట్ వేశామని చెప్పారు. ఇంతలో కార్పొరేటర్ సాకే చంద్రశేఖర్... ఆంధ్రజ్యోతిలో 'ప్రెస్‌వాళ్లకివ్వాలయ్యా...?' శీర్షికన ప్రచురితమైన కథనాన్ని చూపుతూ ఏసీపీ శ్రీనివాసులునుద్దేశించి మాట్లాడారు. ఈయన ప్రెస్‌వాళ్ల పేరు చెప్పి వసూలు చేస్తున్నాడన్నారు. అక్రమ కట్టడాలు, సెల్లార్లు తవ్వుతుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి జోక్యం చేసుకుని.. విలేకరులు, రాజకీయనాయకులు పేర్లు చెప్పి వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ అధికారులంటే ఎందుకు అంత అలుసని, కమిషనర్ నాగరాజు ఒత్తిళ్లతోనే వెళ్లారని, ఆ వర్గాల ఉద్యోగులపై ఒత్తిడి చేయడం సరికాదని, వచ్చే సమావేశంలో ఇదే అంశం ప్రస్తావిస్తానని కార్పొరేటర్ సాకే చంద్ర అన్నారు. పార్కింగ్ అంశంపై ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగరంలో ఎవరైనా స్థలాలు ఆక్రమిస్తే చర్యలు తప్పనిసరిగా ఉంటాయన్నారు. మొత్తం అజెండా పూర్తిగా చదవకుండానే, కొన్ని పనులు, అంశాలు ఆమోదం లేకుండానే సమావేశం ముగిసింది.

భూ సమస్యలను పరిష్కరించండి : ఎమ్మెల్యే

రాప్తాడు/అనంతపురం రూరల్/శింగనమల, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రాప్తాడు మండలం బండమీదపల్లిలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె ప్రసంగించారు. వైసీపీ ప్రభుత్వంలో మాదిరి ఇష్టానుసారంగా ప్రజలను ఇబ్బంది పెడితే సహించేది లేదని అన్నారు. అధికారులు మొక్కుబడిగా అర్జీలు స్వీకరించి వెళ్లిపోవడం కాదని, వాటికి వెంటనే పరిష్కారం చూపాలని అన్నారు. ఆన్‌లైన్‌లో తప్పిదాలను వెంటనే సరిచేయాలన్నారు. పేదలకు ఇంటి స్థలంతో పాటూ ఇళ్లు నిర్మిస్తామన్నారు. గ్రామంలో ధ్యాన మందిరం కోసం 5 సెంట్లు స్థలం చూపాలని తహసీల్దార్‌కు సూచించారు. ఆ తరువాత ఉపాధి హామీ పథకం ద్వారా రైతు అమిలినేని మహేంద్రనాథ్ నిర్మించిన గోకులం షెడ్డును ప్రారంభించారు. టీడీపీ నాయకులతో కలిసి రూ.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభించారు. రానున్న రోజుల్లో మరిన్ని నిధులు మంజూరు చేసి గ్రామాల్లో అవసరమైన పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయకుమారి, సీఐ శ్రీహర్ష, టీడీపీ నాయకులు కొండప్ప, శ్రీనివాసులు, నెట్టెం లక్ష్మీనారాయణ, వెంకట్రాముడు, శ్యాంకుమార్, రాజేంద్ర, నారాయణస్వామి, రమణ, కిష్టా, జయప్ప, గోపాల్, తిరుపాలు, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత



అనంతపురం రూరల్ మండలంలో వినతి పత్రాలు స్వీకరిస్తున్న అధికారులు

మిగులు భూములపై..

తమ భూములు మిగులు భూములు కింద నమోదయ్యాయని, వాటిని పరిష్కరించాలని పలువురు రైతులు రెవెన్యూ సదస్సుల్లో అధికారులకు విన్నవించారు. అనంతపురం రూరల్ మండలంలోని తాటిచెర్ల, సోములదొడ్డి గ్రామాల్లో ఇన్‌చార్జ్ తహసీల్దార్ మంజునాథ్ ఆధ్వర్యంలో మంగళవారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. రెండు గ్రామాల్లో 55 ఫిర్యాదులు అందాయి. వీటిలో ఎక్కువ శాతం మిగులు భూముల కింద నమోదైన వాటిని పరిష్కరించాలని రైతులు వినతులు అందించారు. రికార్డులను పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని ఇన్‌చార్జ్ తహసీల్దార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు గోవిందునాయక్, మంజునాథ్, సాయికిరణ్, సర్వేయర్ శ్రీరాములు పాల్గొన్నారు.

● రైతుల భూసమస్యలను పరిష్కారిచాడానికి రెవెన్యూ సదస్సు వేదిక ఉపయోగపడుతుందని శింగనమల నియోజకవర్గం ప్రత్యేక అధికారి బషీర్ అస్లాం అన్నారు. కల్లుమడి గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు సందర్భంగా ఎస్సీ కాలనీలో ర్యాలీ నిర్వహించి అక్కడ సమస్యలను అధికారులు తెలుసుకున్నారు. అనంతం సదస్సు ఏర్పాటు చేసి రైతుల నుంచి సమస్యలపై అర్జీలు తీసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సాకే బ్రహ్మయ్య, ఎంపీడీఓ నిర్మలా కూమారి, రీసర్వే డిప్యూటి తహసీల్దార్ పునీత్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అనంతపురం క్రైం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని సోమనాథ్‌నగర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. హైదరాబాద్-బెంగుళూరు జాతీయ రహదారిపై రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో బైకులపై ప్రయాణిస్తున్న అబ్దుల్లా, జయంత్ గాయపడ్డారు. అబ్దుల్లా, పవన్ బంకులో పెట్రోలు పట్టించుకుని ఎంకేఎం ఫంక్షన్ హాల్ ఎదురుగా వస్తుండగా జయంత్ అనే యువకుడు ఎదురుగా వచ్చి ఢీకొట్టాడు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. గాయపడ్డ ఇద్దరిదీ అనంతపురం రూరల్ మండలంలోని పిల్లిగుండ్లకాలనీ.

ప్రజా సమస్యలపై చర్చించండి: సీపీఎం

అనంతపురం క్రైం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కౌన్సిల్ సమావేశంలో ప్రజా సమస్యలపై చర్చించాలంటూ సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కౌన్సిల్ సమావేశం నేపథ్యంలో సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ...నగరంలో రోడ్లపై పడిన గుంతలను పూడ్చాలని, మున్సిపల్ స్థలాలను అన్యాక్రాంతం కాకుండా కాపాడాలన్నారు. మరువవంక, నడిమివంకకు ప్రహరీగోడలు ఏర్పాటు చేయాలని కోరారు. క్లాప్ ఆటోలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్, వలి, వెంకటనారాయణ, ముత్తుజా తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

సౌత్ కెనాల్ కింద ప్రతి ఎకరాకు నీరిస్తాం

●ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ● డిస్ట్రిబ్యూటరీ చైర్మన్‌గా చంద్రశేఖర్‌నాయుడు ఏకగ్రీవంగా ఎన్నిక

బుక్కరాయసముద్రం/శింగనమల, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎంపీఆర్ సౌత్ కెనాల్ కింద ఉన్న ప్రతి ఎకరాకు సాగు నీరు అందించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. మంగళవారం అనంతపురం హెచ్చెల్సీ కార్యాలయంలో సౌత్ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సౌత్ కెనాల్ కింద కాలువ ఆయకట్టు చైర్మన్లు పది మంది సభ్యులు హాజరై... గార్లదిన్నె మండలానికి చెందిన చంద్రశేఖర్‌నాయుడును చైర్మన్‌గా, శింగనమల మండలం నిదనవాడ గ్రామానికి చెందిన కుమ్మెత చంద్రాయుడును వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీని, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, జిల్లా టీడీపీ సీనియర్ నేత ముంటిమడుగు కేశవరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సౌత్ కెనాల్ కింద ప్రతి ఎకరాకు సాగు నీరు అందించే విధంగా కాలువ ఆయకట్టు చైర్మన్లు చొరవ చూపాలన్నారు. నిధులు మంజూరు చేయించి కాలువ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండుశ్రీనివాసులు, చితంబరిదొర తదితరులు పాల్గొన్నారు. చంద్రాయుడును తెలుగుయవత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు, నాయకులు ఆకుల ఆంజనేయులు, బాబు సన్మానించారు. ఈ సందర్భంగా చంద్రాయుడు మాట్లాడుతూ సౌత్ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కింద రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తా అన్నారు.



ఎమ్మెల్యేని కలిసిన సౌత్ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్, ఆయకట్టు చైర్మన్లు

ఇళ్ల నిర్మాణాల్లో అక్రమాలపై చర్యలు

● లబ్ధిదారుల ఎంపికను వేగవంతం చేయండి ● రాప్తాడు ఎమ్మెల్యే



గృహ నిర్మాణశాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం సిటీ/రూరల్, డిసెంబరు 17, (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల నిర్మాణాల్లో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకుంటామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె తమ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆ శాఖ డీఈఈ, ఏఈలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గతంలో జరిగిన అక్రమాలు, కొత్తగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియపై అధికారులతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ప్రోద్బలంతో ఇళ్ల నిర్మాణాల్లో జరిగిన అక్రమాలపై ఇప్పటికే సమగ్ర విచారణ సాగుతోందని తెలిపారు. తప్పు చేసిన ప్రతిఒక్కరిపై చర్యలు ఉంటాయన్నారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా సకాలంలో బిల్లులు వచ్చేలా చూడాలన్నారు. గతంలో ఎన్టీఆర్ హౌసింగ్ కింద ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు బిల్లులు మంజూరయ్యేలా కృషి చేస్తామన్నారు. సమావేశంలో డీఈఈ శ్రీమన్నారాయణ, ఏఈఈలు జమీల్ అహమ్మద్, రామక్రిష్ణ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

డిస్ట్రిబ్యూటరీ చైర్మన్‌కు ఘన స్వాగతం



గార్లదిన్నెలో డిస్ట్రిబ్యూటరీ చైర్మన్‌కు స్వాగతం పలుతున్న టీడీపీ నేతలు

గార్లదిన్నె, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాలలో సౌత్ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్‌గా గార్లదిన్నెకు చెందిన మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్‌నాయకుడు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సౌత్ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ చంద్రశేఖర్‌నాయుడు, డైరెక్టర్లు మంగళవారం ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీని, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడును, ముంటిమడుగు కేశవరెడ్డిని, రామలింగారెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. సౌత్ కెనాల్ చైర్మన్‌గా ఎన్నికై మంగళవారం సాయంత్రం స్వగ్రామానికి విచ్చేసిన చంద్రశేఖర్‌నాయుడుకు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, భారీ సంఖ్యలో హాజరై శాలువాలతో ఘనంగా సత్కరించి, పూలమాలతో ఘన స్వాగతం పలికారు. డ్యాం రోడ్డు సర్కిల్ నుంచి భారీగా బాణ సంచా కాల్చారు. దీంతో గార్లదిన్నె జనసంద్రంగా మారింది. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గుర్రం ఆదినారాయణ, నాయకులు గుత్తా బాలకృష్ణ, పాండు, జయరాం, రామచంద్ర, నరసింహారెడ్డి, చితంబరప్ప, ఈశ్వర్‌రెడ్డి, ఈశ్వరయ్య, కొడిదల రామకృష్ణ, శ్రీనాథ్, కొడిదల శీనా, కొర్రపాటి శీనా, చౌదరి, నల్లప్ప, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

మట్టి పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి

అనంతపురంరూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మట్టి పరీక్షల ఫలితాల ఆధారంగా రైతులు ఎరువులు వాడాలని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ సూచించారు. మంగళవారం మండలంలోని కురుగుంట, చిన్నంపల్లి గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి శశికళ అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, ఏడీ రవి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ.. అరటిలో సిగటోక తెగులు నివారణ చర్యలు గురించి తెలిపారు. శనగలో ఎండు తెగులు నేల ద్వారా సోకుతుందన్నారు. ట్రైకోడెర్మావిరిడి రెండు కిలోలు, 90 కిలోల పశువుల ఎరువు, పది కిలోల వేపపిండి కలిపి తెల్లటి బూజు వచ్చినప్పుడు పిచికారి చేస్తే నేలకు ప్రయోజనంగా ఉంటుందని వివరించారు. ఏడీ మాట్లాడుతూ..రబీ పంట కోసం ఈనెల 30వతేదిలోపు ప్రీమియం చెల్లించాలన్నారు. ప్రీమియం చెల్లింపునకు ముందు పంట నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆ శాఖ అధికారులు రామాంజనేయులు, మురళీకృష్ణ, చిన్నంపల్లి సర్పంచు శివశంకర్, ఆత్మ ఏటీఎం అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

పప్పుశనగలో సస్యరక్షణ పాటించండి

ఆత్మకూరు: పప్పుశనగ పంట సాగు చేసిన రైతులు సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చునని డీఏఓ మహేశ్వరమ్మ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులుకు పలుసూచనలు సలహాలును తెలియజేశారు. పప్పుశనగ పంటను పరిశీలిచారు.ప్రస్తుతం పూతదశలో తీసుకోవాల్సిన పద్ధతులను తెలియజేశారు. కార్యక్రమంలో డీడీఏ మద్దిలేటి, ఏడీఏ రవికుమార్, ఏఓ సుచరిత, ఏఈఓ సుజిత పాల్గొన్నారు.

ఎంఈఓపై లైంగిక వేధింపుల కేసు నమోదు

బుక్కపట్నం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) గోపాల్‌నాయక్‌పై మంగళవారం లైంగిక వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. ఓ పాఠశాలలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగి ఈనెల 16న ఎంఈఓ కార్యాలయానికి సంతకం నిమిత్తం వెళ్లారు. ఆ సమయంలో ఎంఈఓ గోపాల్‌నాయక్.. తన చెయ్యి పట్టుకుని, అసభ్యంగా ప్రవర్తించారని బాధితురాలు మంగళవారం సాయంత్రం పిర్యాదు చేసింది. ఆ మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

ప్రశాంతతతోనే ఆరోగ్యం

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విధులనుంచి విరమణ పొందిన వారు ప్రశాంతతను అలవర్చుకుంటేనే ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందుతారని ఎస్కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ పుల్లారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమసంఘం ఆధ్వర్యంలో పెన్షనర్ల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ప్రభాకర్ గుప్తా అధ్యక్షతన వహించిన వేడుకలకు పుల్లారెడ్డి, రమేష్‌బాబు, ఎస్టీఓ లక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. 62 సంవత్సరాల వయసు వరకు ఉద్యోగమే జీవితంగా భావించి విధుల్లో అనేక అంశాలపై ఉద్యోగులు పరిజ్ఞానా న్ని సాధించి ఉంటారని తెలిపారు ఉద్యోగ విరమణ అనంతరం భౌతిక శక్తి సన్నగిల్లడంతో కుటుంబ సభ్యులపై ఆధారపడాల్సి వస్తుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రశాంతతను అలవర్చుకుంటునే జీవిత కాలం పెరుగుతుంద ని తెలిపారు. అనంతరం 75 సంవత్సరాలపైబడిన రిటైర్డ్ ఉద్యోగులను స న్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రియాజుద్దీన్ అహ్మద్, సుబ్బయ్య, గోపాల్, సత్తారు, నరసింహమూర్తి, కాంతయ్య, రమణయ్య, పారిశ్రామికవేత్తలు సుధీర్, సుజాత పాల్గొన్నారు.



రిటైర్డ్ ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

క్లుప్తంగా..

ఘర్షణలో నలుగురికి గాయాలు

గుత్తి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని నమాజ్ కట్ట వీధిలో స్థల విషయంలో మంగళవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగి నలుగురు తీవ్రంగా గాయపడ్డారని పోలీసులు తెలిపారు. నమాజ్ కట్ట వీధిలో ఓ స్థల విషయంలో మైనుద్దీన్, ఫకృద్దీన్‌ల మధ్య గొడవ జరిగింది. మాటా మాట పెరిగి ఘర్షణకు దారితీసింది. ఇందులో ఒకరిపైఒకరు రాళ్లతో దాడి చేసుకున్నారు. ఫకృద్దీన్, అతడి కుమారుడు షఫి, మరదలు షాహీనాకు, మరో వర్గంలో మైనుద్దీన్‌కు తీవ్రగాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోలీసులు ఇరువర్గాలతో ఫిర్యాదు తీసుకుని దర్యాప్తు చేపట్టారు.

సచివాలయాల తనిఖీ

గుంతకల్లు టౌన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని 32, 33వ సచివాలయాలను మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ మంగళవారం సాయంత్రం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి హాజరు పట్టికలను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా చూడాలన్నారు. సమస్యలతో సచివాలయానికి వచ్చే ప్రజల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని తెలిపారు.

టీడీపీ శ్రేణుల సంబరాలు

బొమ్మనహాళ్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోనేహాళ్ గ్రామంలో టీడీపీ శ్రేణులు మంగళవారం సంబరాలు చేసుకున్నారు. సాగునీటి సంఘం జిల్లా అధ్యక్షుడిగా కొండాపురం కేశవరెడ్డి ఎన్నికైన సందర్భంగా హర్షం వ్యక్తం చేస్తూ పెద్దఎత్తున బాణాసంచా కాల్చి, స్వీట్లను పంపిణీ చేశారు. ముందుగా కేశవరెడ్డితో కలిసి స్థానిక ఈశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. కేశవరెడ్డి మాట్లాడుతూ రెండోసారి సాగునీటి కమిటీలో జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేసినందుకు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులుకు కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు అందుబాటులో ఉండి సాగునీటికి కృషి చేస్తానని తెలిపారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు జగన్నాథ్‌రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి, డిస్ట్రిబ్యూటరీ సంఘం అధ్యక్షుడు గోపాల్, నాయకులు శివశంకర్‌రెడ్డి, తిమ్మారెడ్డి, మోహన్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

కళ్యాణదుర్గం రూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): శెట్టూరు మండలం అడవి గొల్లపల్లి సమీపంలో ఆటో బోల్తా పడడంతో పలువురికి గాయాలయ్యాయి. శెట్టూరు నుంచి అడవి గొల్లపల్లికి ప్రయాణికులతో వస్తున్న అదుపు తప్పి బోల్తాపడింది. ప్రమాదంలో మాసక్క, గంగమ్మ, అఖిల, అవినాష్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. మరికొంతమందికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను సమీప ఆస్పత్రికి తరలించారు. శెట్టూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అలాగే కళ్యాణదుర్గం ఆర్డీవో కార్యాలయంలో విధులు ముగించుకుని బైక్‌లో అనంతపురం వెళుతున్న ఆర్ఐ విష్ణుతేజను ట్రాక్టర్ తగలడంతో కిందపడి గాయపడ్డాడు. అతడిని స్థానికులు చికిత్స నిమిత్తం కళ్యాణదుర్గం ఆస్పత్రికు తరలించారు. విషయం తెలుసుకున్న ఆర్డీవో వసంత్‌బాబు, తహసీల్దార్ భాస్కర్ ఆస్పత్రిలో ఆర్ఐను పరామర్శించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికు తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యారంగ పరిరక్షణకు ఉద్యమించాలి: ఎస్ఎఫ్ఐ

గుత్తి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం దేశంలో విద్యారంగాన్ని నాశనం చేస్తోందని, ఈ రంగాన్ని పరిరక్షించేందుకు ఐక్యంగా ఉద్యమించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న పిలుపునిచ్చారు. పట్టణ శివారులోని మాచినేని ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎస్ఎఫ్ఐ 32వ జిల్లా మహాసభలను ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలుత తొలుత ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ప్రసన్న మాట్లాడుతూ కేంద్రంలో పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ దేశంలో విద్యారంగాన్ని సర్వనాశన చేసిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు ప్రజల హక్కులను కాలరాస్తున్నరని ఆగ్రహ వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఐక్యంగా పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్, అధ్యక్షుడు సిద్దు, రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్, నాయకులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని ధర్నా

శెట్టూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): తమకు జీతాలు చెల్లించాలంటూ గతంలో పని చేసిన యానిమేటర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలకేంద్రంలోని ఐకేపీ కార్యాలయానికి తాళాలు వేసి నిరసన చేపట్టారు. ఎమ్మార్పీఎస్ నాయకులు మద్దతు పలికారు. సుమారు నాలుగు గంటల పటు కార్యాలయానికి తాళం వేసి వెలుగు సిబ్బందికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఏపీఎం కార్యాలయానికి చేరుకొని త్వరలోనే జీతాలను అందజేస్తామని తెలపడంతో వారు ఆందోళన విరమించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు గురుతిప్పేస్వామి, పాలాక్షి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కూలీ మృతి


బెస్త పద్మావతి (ఫైల్)

కూడేరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కూలీ బెస్త పద్మావతి (53) మృతి చెందింది. కొర్రకోడు గ్రామానికి చెందిన కూలీలు టమోట కాయలను తొలగించేందుకు ఈ నెల 11వ తేదీన శివరాంపేటకు ఆటోలో వెళ్లి సాయంత్రం తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. కాగా కొర్రకోడు సమీపంలో మలుపు వద్ద ద్విచక్ర వాహనం ఎదురెదురుగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఒకరు అక్కడిక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలు కావడంతో అనంతపురానికి తరలించారు. బెస్త పద్మావతి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో గత సోమవారం కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి సమయంలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం కర్నూలు ఆసుపత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం చేసినట్లు చెప్పారు.

భూ సమస్యల్ని 45 రోజుల్లోగా పరిష్కరిస్తాం

● దుద్దేకుంట రెవెన్యూ సదస్సులో ఆర్డీఓ వసంత్‌బాబు


రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీఓ వసంత్‌బాబు

బెళుగుప్ప, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో రైతులు అర్జీల ద్వారా తెలిపిన భూ సమస్యల్ని నిశితంగా పరిశీలించి 45 రోజుల్లోగా పరిష్కరిస్తామని ఆర్డీఓ వసంత్‌బాబు తెలిపారు. మండలంలోని దుద్దేకుంట గ్రామంలో మంగళవారం రెవెన్యూ అధికారులు రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఇందులో ఆర్డీఓ పాల్గొని మాట్లాడారు. మీ భూమికి భద్రత కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని రైతులతో తెలిపారు. భూమికి సంబంధించిన ఏ సమస్యలున్నా అర్జీల ద్వారా అధికారులకు తెలపాలన్నారు. 45 రోజుల్లోగా పరిష్కారం చేస్తారని చెప్పారు. పలువురు గ్రామస్థులు శ్మశాన వాటిక సమస్యతో ఇబ్బంది పడుతున్నామని, పరిష్కరించాలని కోరగా.. ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం పలువురు రైతులు తహసీల్దార్ షర్మిలకు అర్జీలు అందజేశారు. ఆర్ఐ రమాదేవి, వీఆర్వోలు చంద్ర, రమేష్, మధు, ప్రదీప్, సర్వేయర్ నీలకంఠ, మాజీ వైస్ ఎంపీపీ తిమ్మప్ప, సర్పంచ్ రత్నమ్మ టీడీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉరవకొండ : మండలంలోని పెన్నహోబిలంలో జరిగిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి 18 అర్జీలు వచ్చినట్లు ఆర్డీవో శ్రీనివాసులు తెలిపారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి తిప్పేనాయక్, తహసీల్దారు మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని పాతగుంతకల్లులో గల అంకాలమ్మ దేవాలయంలో జరిగిన రెవెన్యూ సదస్సులో రైతులు 16 అర్జీలు అందజేశారు. తహసీల్దార్ రమాదేవి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

యాడికి: మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి 68 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. డీటీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: మండలంలోని కొంతానపల్లిలో రెవెన్యూ సదస్సులో రైతులు 7అర్జీలను అందజేసినట్లు తహశీల్దార్ నాగరాజు తెలిపారు. సర్పంచ్ విశ్వనాథ్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కుందుర్పి: మండలంలోని జంబుగుంపలలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. పలువురు రైతులు తహసీల్దార్ శ్రీనివాసులుకు అర్జీలు ఇచ్చారు. టీడీపీ మండల కన్వీనర్ ధనుంజయ, నాయకులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గంరూరల్: మండలంలోని హులికల్లులో జరిగిన రెవెన్యూ సదస్సులో రైతులు 11 అర్జీలు ఇచ్చినట్లు తహసీల్దార్ భాస్కర్ తెలిపారు. సర్పంచ్ చిత్తప ఎంపీడీవో రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం: మండల కేంద్రంలో తహసీల్దార్ సుమతి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది. పలు భూ సమస్యలపై రైతులు అర్జీలను అందజేశారు. ఎంపీడీవో నందకిషోర్, టీడీపీ మండల టీడీపీ కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, జెడ్పీటీసీ ప్రభావతమ్మ హాజరయ్యారు.

బొమ్మనహాళ్ : మండలంలోని ఉద్దేహాళ్‌లో రెవెన్యూ సదస్సు జరిగింది. పలువురు రైతులు, టీడీపీ నాయకులు భూ సమస్యల్ని పరిష్కరించాలని 21 అర్జీలు తహశీల్దార్ మునివేలుకు అందజేశారు.

జింకల బారి నుంచి పంటలను కాపాడుతాం: డీఎఫ్ఓ


రైతులతో మాట్లాడుతున్న డీఎఫ్ఓ విఘ్నేష్


విడపనకల్లు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): జింకల బారి నుంచి పంటలను కాపాడతామని జిల్లా అటవీ అధికారి విఘ్నేష్ తెలిపారు. మండలంలోని పెద్ద కొట్టాల పల్లి గ్రామ పరిధిలోని వివిధ రకాల పంటలను మంగళవారం ఆయన పామిడి సెక్షన్ అధికారి, పందికుంట బీట్ అధికారి సతీష్‌తో కలిసి పరిశీలించారు. పప్పుశనగ, కంది పంటలలో జింకలు నాశనం చేసిన ప్రదేశాలను పరిశీలించారు. పంటలపై జింకల దాడి ఎక్కువైందని రైతులు అధికారులకు తెలిపారు. అవి పంటలను తినేస్తున్నాయని వాపోయారు. డీఎఫ్ఓ మాట్లాడుతూ జింకలు దాదాపుగా 15 ఏళ్ల నుంచి అడవుల్లో వృద్ధి చెందాయని, వాటిని ఒక్కసారిగా తరలించటం సాధ్యం కాదని అన్నారు. మండలంలోని అటవీ ప్రాంతంలో ఎన్ని జింకలు ఉంటాయో అంచనావేసేందుకు ఓ ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. వేసవిలో వాటిని తరలించే ప్రయత్నం చేస్తామని అన్నారు. ప్రతి ఏటా కొన్నింటిని పట్టి అటవీ ప్రాంతాల్లో వదిలేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పెద్ద కొట్టాలపల్లి రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెన్షనర్ల దినోత్సవం


గుంతకల్లులో పెన్షనర్లను సన్మానిస్తున్న దృశ్యం

తాడిపత్రి/గుత్తి/ గుంతకల్లు/ఉరవకొండ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి పట్టణంలోని టీచర్స్‌కాలనీలో ఉన్న పెన్షనర్ల సంఘం భవనం ప్రాంగణంలో మంగళవారం జాతీయ పెన్షనర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 73 ఏళ్లు నిండిన పెన్షనర్లకు సంఘం అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి శాలువాకప్పి సత్కరించారు. అనంతరం అధ్యక్షుడు మాట్లాడుతూ పెన్షన్ కోసం పోరాడిన నకారా సేవలను కొనియాడారు. పెన్షనర్లు విజయభాస్కర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు. అలాగే గుత్తి పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్ల భవనంలో మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మియా పలువురు పెన్షనర్లకు సన్మానం చేశారు. పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అబుబకర్, ఉపాధ్యక్షురాలు స్వర్ణాంబ, కార్యదర్శి రామ్మోహన్, నాయకులు పాల్గొన్నారు. గుంతకల్లు పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో పెన్షనర్లు రాబియాబీ, విశాలాక్షి, వసంతకుమారి, సుంకన్నకు సన్మానం చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు మస్తానప్ప, గౌరవఅధ్యక్షుడు నారాయణస్వామి, సభ్యులు పాల్గొన్నారు. ఉరవకొండ పట్టణంలోని విశ్రాంతి ఉద్యోగుల భవనంలో సబ్ ట్రెజరీ అధికారి నాగేంద్ర, స్టేట్‌బ్యాంకు మేనేజర్ సుధాకర్ విశ్రాంతి ఉద్యోగులను సన్మానించారు. అలాగే వారి ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. విశ్రాంతి ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత


చెక్కును అందజేస్తున్న పయ్యావుల శ్రీనివాసులు

ఉరవకొండ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు కాగా.. అందకు సంబంధించిన చెక్కులను టీడీపీ నేత పయ్యావుల శ్రీనివాసులు మంగళవారం అందజేశారు. అనంతపురంలో మంత్రి నివాసం వద్ద ఆయన నింబగల్లుకు చెందిన బీ.బాబుకు రూ.40వేలు, శ్రీరాములుకు రూ.25వేల చెక్కును అందించారు. నాయకులు సిద్ధప్ప, అంజి, సురేష్ పాల్గొన్నారు. అనంతరం 10వ హెచ్చెల్సీ పరిధిలోని సాగునీటి సంఘం సభ్యుడు తిప్పారెడ్డి పయ్యావుల శ్రీనివాసులును మర్యాద పూర్వకంగా కలిశారు.

35వ వార్డులో శుభోదయం

గుంతకల్లు టౌన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని టీడీపీ పట్టణ ఇన్‌చార్జి గుమ్మనూరు నారాయణస్వామి పేర్కొన్నారు. స్థానిక 35వ వార్డులో మంగళవారం మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్ మహమ్మద్ షరీఫ్, వార్డు ఇన్‌చార్జి షేక్ ఫజులు శుభోదయం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందుకు ముఖ్యఅతిథిగా గుమ్మనూరు నారాయణస్వామి హాజరయ్యారు. వార్డులో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ నిర్మాణం, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వార్డు ప్రజలు కోరారు. అన్ని సమస్యల్ని త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు గుమ్మనూరు వెంకటేష్, బీఎస్ కృష్ణారెడ్డి, ఆమ్లెట్‌మస్తాన్‌యాదవ్, గుజరిమహ్మద్‌ఖాజా, అంజి, టెంకాయల యూసుఫ్, హనమంతు, కే వలిభాషా, సద్దాంహుసేన్, షామీర్‌బాషా, మెకానిక్‌మస్తాన్, తలారి మస్తానప్ప, యుగంధర్, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

సబ్ జైలు తనిఖీ

కళ్యాణదుర్గం రూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సబ్ జైలును అనంతపురం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ శివప్రసాద్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి బ్యారెక్‌లు, మరుగుదొడ్లు, వంటగది, స్టోర్ రూము, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఖైదీలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. జైలులో కల్పించే సౌకర్యాల పై ఆరా తీశారు. కార్యక్రమంలో ప్యానల్ లాయర్ దాదా ఖలందర్, పారా లీగల్ వలంటీర్ అనిత, డాక్టర్ సయ్యద్ హర్షద్ పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ల సీజ్

తాడిపత్రి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడప రహదారిలో ఐశ్వర్యవిల్లాస్ సమీపంలో మంగళవారం రూరల్ ఎస్ఐ ధరణీబాబు వాహనాలను తనిఖీ చేస్తూ అధికలోడుతో వెళుతున్న నాలుగు ఇసుక టిప్పర్లను సీజ్ చేశారు. కడప జిల్లా కొండాపురం మండలం ఏటూరు ఇసుకరీచ్ నుంచి నంద్యాల వైపునకు వెళ్లే నాలుగు టిప్పర్లను రికార్డులను తనిఖీ చేయగా బిల్లులు సరిగా లేకపోవడంతోపాటు అధికటన్నేజీతో వెళ్తున్నాయన్నారు. దీంతో వాటిని సీజ్‌చేసినట్లు ఆయన చెప్పారు.

నిందితుల కోసం గాలింపు

యల్లనూరు, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): హత్యకేసులో నిందితుల కోసం కొండాపురం పోలీసులు మంగళవారం యల్లనూరు మండలకేంద్రలో గాలింపు చర్యలు చేపట్టారు. యల్లనూరులోని బీసీ కాలనీకి చెందిన సురేష్ గత సోమవారం రాత్రి కడపజిల్లా ఆర్‌ఎస్ కొండాపురం మండలం లావనూరు సమీపంలో అనుమానాస్పదస్థితిలో మరణించాడు. మృతదేహంపై ఆనవాళ్ల ప్రకారం పోలీసులు నిందితులను గుర్తించారు. నిందితులు యల్లనూరుకు చెందిన వారు కావడంతో వారి కోసం గాలించినట్లు తెలిసింది. ఇందులో ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. విచారణ కోసం కడపజిల్లాకు తీసుకువెళ్లినట్లు తెలిసింది.

తెలంగాణ మద్యం స్వాధీనం

తాడిపత్రి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని కొత్తబ్రిడ్జి వద్ద మంగళవారం అక్రమంగా తరలిస్తున్న తెలంగాణకు చెందిన రూ.1.44లక్షల విలువగల 48మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ సాయిప్రసాద్ తెలిపారు. వాహనాలు తనిఖీలో భాగంగా గుత్తివైపు నుంచి తాడిపత్రికి వస్తున్న వాహనాన్ని తనిఖీచేసి మద్యంబాటిళ్లను గుర్తించినట్లు తెలిపారు. వాటిని సీజ్‌చేసి తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన గోపిరెడ్డి, రెడ్లకుంట గ్రామానికి చెందిన నరసింహారావు, నంద్యాలజిల్లా ఆత్మకూరు మండలం వెంకటాపురానికి చెందిన సుధాకర్‌రెడ్డి, తాడిపత్రి మండలం బ్రాహ్మణపల్లికి చెందిన దస్తగిరిని అరెస్ట్ చేసి కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

తాడిపత్రి, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆంజనేయస్వామిమాన్యానికి చెందిన యమున (19) అనే యువతి చికిత్స పొందుతూ మృతి చెందింది. యమున బీఎస్సీ నర్సింగ్ పూర్తిచేసి ఉద్యోగం కోసం దరఖాస్తు చేసింది. ఇందుకు గుంతకల్లు, విజయవాడ రెండింటిలో ఏదో ఒకచోట ఇంటర్వ్యూ వస్తుందని తల్లి చంద్రకళతో చెప్పగా.. మనం డబ్బులు కట్టలేము ఎందుకు అవన్నీ అని ఆమె వాదించింది. దీంతో మనస్తాపానికి గురైన యమున ఈనెల 13న సూపర్ వాస్మోల్‌తాగి ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబ సభ్యులు వెంటనే అనంతపురం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు చెప్పారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

బొమ్మనహాళ్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కానాపురం గ్రామంలో మంగళవారం టీడీపీ నాయకులు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జోరుగా చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి సభ్యత్వం చేయించారు. రూ. 100 చెల్లించి సభ్యత్వం తీసుకుంటే రూ. 5 లక్షల వరకు ప్రమాద బీమా వర్తిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాధాకృష్ణ, మల్లికార్జున, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీకి కుర్చీల వితరణ

శెట్టూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయానికి సీఎంసీ ఛైర్మన్ చేతన్ కుర్చీలను వితరణ చేశారు. పాఠశాలలో మంగళవారం 20 కుర్చీలను ఎస్‌వో లలితకు ఆయన అందజేశారు. ఇందుకు ఆమె పాఠశాల తరపున కమిటీ చేతన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా తిరుమంజన స్నపనం

గుంతకల్లు, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): ఆంజనేయ స్వామికి ప్రీతిపాత్రమైన పునర్వసు తిరు నక్షత్ర సంక్రమణాన్ని పురస్కరించుకుని కసాపురం ఆలయంలో స్వామివారికి తిరుమంజన స్నపనం నిర్వహించారు. మంగళవారం ఉదయం ఆలయంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలకు తిరుమంజన స్నపనం గావించి అలంకరణలు చేశారు. అనంతరం శాస్త్రోక్తంగా పూజాధికాలను నిర్వహించారు. ఆలయ ఈఓ వాణి, ధర్మకర్త సుగుణమ్మ, వేద పండితులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.


స్వామివారికి పూజ చేస్తున్న అర్చకుడు

ఎమ్మెల్యే ఆర్థిక సాయం


ఆర్థికసాయం అందిస్తున్న ఎమ్మెల్యే

పుట్లూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త రామయ్య అనారోగ్యానికి గురికావడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆర్థికసాయం అందించినట్లుగ్రామ మాజీ సర్పంచు రవీంద్రనాయుడు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయానికి రామయ్యను పిలిపించి ఆరోగ్యంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం అందించినట్లు చెప్పారు.

ఎమ్మెల్యేను కలిసిన సాగునీటి సంఘం అధ్యక్షులు

పుట్లూరు: మండలంలోని సాగునీటి సంఘాల అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి, నాగిరెడ్డి, శ్రీనివాసులు నాయుడు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీని అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసినట్లు టీడీపీ నాయకుడు కులశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు తాడిపత్రి బ్రాంచ్‌కెనాల్ డిస్ట్రిబ్యూటర్ అధ్యక్షురాలిగా ప్రమీలమ్మను ఎమ్మెల్యే ఆదేశాలమేరకు ఎన్నుకున్నట్లు ఆయన చెప్పారు.

మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

యాడికి, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): నిమ్మపంటలో మేలైన యాజమాన్య పద్ధతులను చేపట్టడం వల్ల అధిక దిగుబడులను సాధించవచ్చునని రేకులకుంట వ్యవసాయక్షేత్రం శాస్త్రవేత్త సుబ్రమణ్యం తెలిపారు. కోనుప్పలపాడు గ్రామంలో మంగళవారం ఆయన నిమ్మసాగు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. నిమ్మలో వచ్చే వేరుకుళ్లు , బంకు, శంకు తెగుళ్లతో పాటు నల్లమంగు, పులుసు పురుగు తదితర వాటి నివారణ చర్యలు గురించి వివరించారు. వేరుకుళ్లు తెగులు నీటి తడుల వ్యత్యాసం ద్వారా సోకుతుందని తెలిపారు. దీనిని తొలిదశలోనే గుర్తించి నిర్వహణ పద్ధతుల ద్వారా నివారించవచ్చునని అన్నారు. మిగిలిన తెగుళ్లకు సంబంధించిన సస్యరక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో రామలక్షుమ్మ, ఉద్యానవనశాఖ తాడిపత్రి అధికారి ఉమాదేవి, వీహెచ్ఏ రవికుమార్, పలువురు నిమ్మసాగు రైతులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ

యల్లనూరు, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం ఉదయం డ్వామా పీడీ సలీంబాషా తనిఖీ చేశారు. అనంతరం మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. తర్వాత ఉపాధి పథకం ద్వారా చేపడుతున్న పండ్లతోటలను పరిశీలించారు. వెంట ఉపాధి సిబ్బంది ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య


సీతయ్య (ఫైల్)

కళ్యాణదుర్గం రూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లు గ్రామంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కుందుర్పి మండలం కరిగానపల్లికి చెందిన వన్నూరుస్వామి కుటుంబం నాలుగేళ్ల క్రితం ముదిగల్లుకు వచ్చి వ్యవసాయ తోటలో పనులు చేసుకుంటూ ఇక్కడే నివాసం ఉండిపోయారు. కాగా అతడి భార్య నెలక్రితం గుండెపోటుతో మృతి చెందింది. దీంతో కుమారుడు బోయ సీతయ్య (17) తల్లి చనిపోయినప్పటి నుంచి మనోవేదనకు లోనై తరచూ బాధపడుతుండే వాడు. ఈ క్రమంలో మంగళవారం తోటలో వేపచెట్టుకు తన తల్లి చీరతోనే ఉరివేసుకుని మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించామన్నారు. తండ్రి వన్నూరుస్వామి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

20 వరకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు

గుత్తి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): జాతీయ ఇంధన పొదపు వారోత్సవాలు ఈనెల 20వరకు జరగనున్నాయని, జయప్రదం చేయాలని విద్యుత్ డీఈఈ రాజశేఖర్ కోరారు. పట్టణంలోని విద్యుత్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కార్యాలయం ఆవరణలో, పలు కూడళ్లలో విద్యుత్ ఆదాపై పోస్టర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అవసరం లేనప్పుడు విద్యుత్‌ను వాడకుండా చూడాలన్నారు. పగటిపూట వీలైనంత వరకు లైట్లు, ఫ్యాన్ల వాడకం తగ్గించాలని సూచించారు. ఏడీఈ సాయిశంకర్, పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్‌పీఎఫ్ జాతీయ వైస్ చైర్మన్‌గా బీఎస్ కృష్ణారెడ్డి

గుంతకల్లు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం (ఎన్‌హెచ్‌ఆర్‌పీఎఫ్) జాతీయ వైస్ చైర్మన్‌గా పట్టణానికి చెందిన న్యాయవాది బీఎస్ కృష్ణారెడ్డి నియమితులయ్యారు. విశాఖపట్టణంలో మంగళవారం నిర్వహించిన ఎన్‌హెచ్‌ఆర్‌పీఎఫ్ జాతీయ బోర్డు సమావేశంలో తనను జాతీయ వైస్ చైర్మన్‌గా ఎంపిక చేసినట్లు కృష్ణారెడ్డి తెలిపారు. ప్రస్తుతం ఉన్న రాష్ట్ర అధ్యక్ష పదవిని కొనసాగిస్తూనే జాతీయ వైస్ చైర్మన్ పదవికి ఎంపికచేశారని అన్నారు., తనపై నమ్మకముంచి వైస్ చైర్మన్ పదవిని ఇచ్చినందుకు జాతీయ చైర్మన్ రామచంద్ర నాయుడుకు, బోర్డు డైరెక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

రాయలసీమ జిల్లాల అధ్యక్షుడిగా నాగార్జున..

నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాయలసీమ జిల్లాల అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన నాగార్జున నియమితులయ్యారు. అనంత ఉమ్మడి జిల్లా కన్వీనరుగా ఉన్న తనను రాయలసీమ జిల్లాల అధ్యక్షుడిగా నియమించారని ఆయన తెలిపారు.